## అధ్యాయము 25

# విశ్రాంతి సంవత్సరము మరియు సునాద సంవత్సరము

25వ అధ్యాయము 23 అధ్యాయములో చర్చించబడిన అంశమును ముగిస్తుంది: "యెహోవా యొక్క నియామక సమయములు." ఇవి యెహోవాను ఆయన చేసిన క్రియలను వారి భక్తిని ప్రతిబింబిస్తూ జ్ఞాపకము చేసికొనుటకు ఇశ్రాయేలీయుల యొక్క ప్రత్యేక కాలములు. 23 అధ్యాయములో నిర్వచించబడిన ప్రత్యేక సమయాలు రోజులు, వారములు, మాసములు కలిగియుంటాయి. ఈ అధ్యాయములో వర్ణించబడినవి సంవత్సరములకు సంబంధించియుంటాయి: విశ్రాంతి సంవత్సరము మరియు సునాద సంవత్సరము. దేశము విశ్రాంతి కొరకు అనుమతించబడినది; ఏ పంట విత్తకూడదు లేక కోయకూడదు. దానికితోడు, సునాద సంవత్సరములో, కొనుగోలు చేయబడిన భూమి అసలైన యజమానులకు తిరిగి ఇవ్వాలి, బానిసలు విడిపించబడాలి. ఈ ప్రత్యేక సంవత్సరములను పాటించుటకు దేవుని యందు నమ్మకము అవసరము. కలిగియున్న ఆచరణలు ప్రజలకు దేవునిపై వారి ఆధారమును జ్ఞప్తికి తెచ్చాయి; కాని అలాగే నేల యొక్క ఫలము కొరకు వినియోగించబడి, బీదవారికి దయను కలిగించాయి, మరియు ఇశ్రాయేలులో మరింతగా ఒక సమానత్వ సమాజమును ఫలితమిచ్చాయి (ఒకరు సమానమైన అవకాశములపై ఆధారపడ్డారు).

### విశ్రాంతి సంవత్సరము (25:1-7)

**1మరియు యెహోవా సీనాయికొండమీద మోషేకు ఈలాగు సెలవిచ్చెను 2నీవు
ఇశ్రాయేలీయులతో ఇట్లనుము నేను మీకిచ్చుచున్న దేశములోనికి మీరు వచ్చిన
తరువాత ఆ భూమికూడ యెహోవా పేరట విశ్రాంతి కాలమును, ఆచరింపవలెను. 3ఆరు
సంవత్సరములు నీ చేను విత్తవలెను. ఆరు సంవత్సరములు నీ ఫలవృక్షములతోటను
బద్దించి దాని ఫలములను కూర్చుకొనవచ్చును. 4ఏడవ సంవత్సరము భూమికి మహా
విశ్రాంతికాలము, అనగా యెహోవా పేరట విశ్రాంతి సంవత్సరముగా ఉండవలెను.
అందులో నీ చేను విత్తకూడదు; నీ ఫలవృక్షములతోటను శుద్ధిపరచకూడదు. 5నీ
కారుచేల పంటను కోసికొనకూడదు, శుద్ధిపరచని నీ వృక్షఫలములను ఏరుకొనకూడదు;
అది భూమికి విశ్రాంతి సంవత్సరము. 6అప్పుడు భూమి యొక్క విశ్రాంతి సంవత్సర**

**సస్యము నీకును నీ దాసునికిని నీ దాసికిని నీ జీతగానికిని నీతో నివసించు పరదేశికిని ఆహారమగును. 7మరియు నీ పశువులకును నీ దేశజంతువులకును దాని పంట అంతయు మేతగా ఉండును.**

**వచనములు 1, 2.** లేవీయకాండములో ఉన్న ఇతర నియమములవలెనే ఈ నియమములు కూడా **మోషే** ద్వారా **ఇశ్రాయేలు**నకు ఇవ్వబడినవి; మరియు దేవుడు ఇశ్రాయేలునకు **ఇచ్చుచున్న దేశములోనికి** వారు ప్రవేశించినప్పుడు ఇవి వర్తింపబడతాయి. కాగా ఈ ప్రత్యక్షతలో ఒక నిరీక్షణాయుతమైన మాట ఉంది; దేవుడు వారికి వాగ్దానము చేసిన దేశమును ఇశ్రాయేలువారు నిజముగానే స్వాధీనపరచుకుంటారు మరియు వారు దానిలో పంటలను కూడా పండిస్తారు.

ఇశ్రాయేలు కనానులోనికి ప్రవేశించినప్పుడు, ఆ **భూమికూడ యెహోవా పేరట విశ్రాంతి కాలమును** ఆచరించాలి. ఈ విశ్రాంతి కాలమును గూర్చి రెండు ప్రాముఖ్యమైన విషయాలు లేవనెత్తబడుతున్నాయి.

మొదటిగా, ఆ సంవత్సరములో ప్రజలు కూడా విశ్రాంతి పొందాలి అని ఈ నియమము చెప్పుటలేదు. ఇశ్రాయేలీయులకు ఒక విశ్రాంతికరమైన సంవత్సరమును ఈ నియమము వాగ్దానము చేయడం లేదు. వారి పంటలను నాటుటకు మరియు కోయుటకు వారు నిషేధించబడినప్పటికీ, ఆ సంవత్సరములో వారు కూడా ఏ పని చేయకుండా ఉండాలని ఈ నియమము చెప్పడం లేదు. పొలంపని నిషేధించబడినది, కాని ఇతర విధములైన పనులు కొనసాగుతూనే ఉంటాయి.

రెండవదిగా, ఆ భూమి యొక్క "విశ్రాంతి" అనేది "యెహోవా పేరట" ఉండాలి. ఏ అర్థములో? ఈ సంవత్సరములో అదనపు ఆరాధన కార్యక్రమాలు లేదా "సమాజములు" చేయకపోయినప్పటికీ, వ్యవసాయాధారిత సమాజములో ఉన్న ఈ ప్రజలకు విత్తుట మరియు కోయుట అనే పనులు లేనందున ఇతర కార్యకలాపాలకు ఎక్కువ సమయము ఉండేది. బహుశ దేవుని మంచితనమును ధ్యానము చేస్తూ ఆయనకు ప్రార్థన చేయుటలో వ్యక్తిగతముగా ఒక్కొక్కరు ఈ విశ్రాంతి సంవత్సరములో గడపాలని వారిపట్ల దేవుడు ఉద్దేశించి ఉంటాడు. ఇది నిజమో కాదో గాని, ఆ భూమి యొక్క "విశ్రాంతి" మాత్రము "యెహోవా పేరట" ఏ విధంగా చేయబడాలి అంటే అది దేవునిచే కోరబడినది, యెహోవాకు గౌరవముగా చేయబడునది, మరియు యెహోవా పట్ల ఇశ్రాయేలీయులకు ఉన్న సమర్పణకు ఒక దర్పణముగా కూడా ఉండినది.

**వచనములు 3-5.** భూమికి **విశ్రాంతి**నివ్వాలి అనడంలో దేవుని భావమేమిటో ఇక్కడ చెప్పాడు. విత్తుట, బద్ధించుట మరియు పంటకోయుటలో **ఆరు సంవత్సరములు** గడిపిన తరువాత, **యేడవ సంవత్సరము**లో ప్రజలు ఏమియు పండించుటకు లేదా కోతకోయుటకు ఏమియు చేయకూడదు (25:3, 4; నిర్గమ. 23:10, 11 చూడండి).[1] సుస్పష్టంగా, ఆరవ సంవత్సరపు పంటలను కోసిన తరువాతనే ఈ యేడవ సంవత్సర కాలము ప్రారంభమవుతుంది. కాబట్టి, శరదృతువు ఆరంభంలో (అంటే పవిత్రమైన కాలెండరులో యేడవ మాసములో) యేడవ వ్యవసాయ సంవత్సరము ప్రారంభమైనప్పుడు ఇశ్రాయేలీయులు ఏ పంటను కూడా నాటకూడదు.

ఈ **విశ్రాంతి సంవత్సరము**లో కొన్ని కొన్ని మొక్కలు వాటంతట అవే

మొలుస్తాయి, కాని అవి కూడా - పొలము యొక్క **కారుచేల పంటను**[2] మరియు **శుద్ధిపరచని వృక్షఫలములను** కూడా - కోయకూడదు (25:5). భూమికి విశ్రాంతి కలుగునట్లుగా అనుమతించాలి, బీడుభూమిగా ఉండిపోవాలి. ఇట్టి నియమము నిస్సందేహముగా ధర్మసంబంధమైన కారణముల కొరకు ఇవ్వబడి ఉండగా, అది బహుశ భూమికి కూడా కొంత ప్రయోజనమును చేకూర్చేది. నేటికాలములో, కొన్ని కొన్ని సార్లు భూమిని బీడుభూమిగానే ఉంచేయడం అనేది మంచి వ్యవసాయ సంబంధిత ప్రక్రియగా చెప్పవచ్చు; అలా చేయడం వలన దాని సారము పునరావాసము చెంది మరింత అధిక దిగుబడికి దారితీస్తుంది.

**వచనములు 6, 7.** ఈ విశ్రాంతి కాలములో వాటంతట అవిగా పెరిగిన **సస్యము** అందరికి **ఆహారము**గా ఉండాలి: ఇశ్రాయేలీయులకు, **దాసునికిని** మరియు **దాసికిని**, **జీతగానికిని,** పరదేశి[శుల]కి, అలాగే జంతువులకు కూడా. క్రొత్త పంటలను విత్తకూడదు లేదా కోయకూడదు; కాని వాటంతట అవిగా పెరిగినది ఏదైనా లేదా ద్రాక్షలచే మరియు చెట్లచే పెరిగినది ఏదైనా సరే ప్రజలచే మరియు జంతువులచే కూడా తినబడవచ్చు.[3]

“ఒకవేళ విశ్రాంతి సంవత్సరములో ఏ పంట కూడా పెరగకపోతే, ప్రజలు ఎలా బ్రదికేవారు? వారు ఏమి తినేవారు?” అని ఒకరు ఆశ్చర్యపడుతుండవచ్చు. అనేక సమాధానాలు సాధ్యం: (1) భూమి “విశ్రాంతి” తీసుకొను కాలములో దానంతట అది ఏదైతే పండిస్తుందో దానిని ప్రజలు తినవచ్చు. (2) జంతువులు పెంచబడుతూ మరియు మేపబడుతూ కూడా ఉండవచ్చు, మరియు అవి వాటంతట అవిగా మొలిచిన గడ్డిని మరియు ధాన్యాన్ని తినవచ్చు. ఆ సంవత్సరములో ఈ జంతువులను కూడా ఆహారముగా తినవచ్చు. నిజానికి, ధర్మశాస్త్రము యొక్క బలి సంబంధిత ఆంక్షలను తీర్చుటకు జంతువులను తప్పకుండా పెంచాలి. (3) ఆరవ సంవత్సరములోనే యేడవ సంవత్సరమునకు సరిపడు ఆహారమును భద్రపరచుకొనుటకు వ్యతిరేకమైన చట్టము ఏదియు లేదు (చూడండి 25:20-22).

శ్రేష్ఠమైన జవాబు ఏదంటే విశ్రాంతి సంవత్సరము అనేది విశ్వాసమునకు ఒక పరీక్ష వంటిది. యేడవ సంవత్సరమునకు సంబంధించిన నియమములను విధేయతతో ఇశ్రాయేలీయులు పాటించుచుండగా దేవుడే వారి అవసరతలను తీర్చునట్లుగా వారు దేవునిపై ఆధారపడవలసినవారుగా ఉన్నారు. ఈ విషయములో, ఈ విశ్రాంతి సంతవ్సరము అనేది విశ్రాంతి దినముతో కొంత సమీపముగా ఉంది. విశ్రాంతి దినమున యూదులు పని ఏమియు చేయకూడదు, వారిని యేడవ దినమున పోషించుటకు దేవుడు ఆరు దినములలోనే సరిపడునంత వారికి సమకూర్చుతాడు అని వారు నమ్మేవారు. ఇశ్రాయేలు అరణ్యములో ఉన్నప్పుడు దేవుడు కూడా మన్నాను ఇచ్చిన ఉదంతము ద్వారా దీనిని ఉదాహరించవచ్చు. ఈ సంవత్సరము యొక్క ద్వంద్వ ఉద్దేశము ఏమంటే, భూమికి కొంత విశ్రాంతి దొరుకునట్లుగా చేయుట మరియు అదే సమయములో తమ పోషణ విషయములో ఇశ్రాయేలు దేవునిపై ఆధారపడే సిద్ధపాటును వారిలో పరీక్షించుట.

## సునాద సంవత్సరము (25:8-55)

సునాద సంవత్సరము అనేది ప్రతీ యాభైయవ సంవత్సరములో, అనగా ఏడు విశ్రాంతి సంవత్సరములు జరిగిన తరువాత జరిగేది. ఈ సునాదమును ప్రాయశ్చిత్తార్థ దినమున శృంగనాదముతో (ఇది బూరతో చేసేవారు, ఈ బూర పొట్టేలు కొమ్ముతో చేయబడేది) ప్రకటించాలి. "సునాద"ము (יֹבֵל, *యోవెల్*) అనే పదము పొట్టేలు కొమ్ము నుండి తన పేరును పొందుకుంటుంది.[4] భూమి ఒక విశ్రాంతి సంవత్సరమును పొందునట్లు దానిని విడిచిపెట్టివేయడముతో (అనగా విశ్రాంతి సంవత్సరములో చేసినట్లుగానే) పాటుగా, ఈ నియమము యొక్క ప్రధానమైన పని ఇశ్రాయేలీయులందరికీ కూడా "విడుదల"ను ఇవ్వడము, తద్వారా ప్రతి వ్యక్తి కూడా తన సొంత భూమికి - అంటే ఇశ్రాయేలు కనాను దేశమును స్వాధీనపరచుకొనిన తరువాత వారి వారి గోత్రముల మధ్య భూమిని విభజించుకొనినప్పుడు వారికి వచ్చిన వారివారి ప్రాంతములకు - వెళ్ళునట్లుగా కూడా ఇవ్వబడినది. ఈ పనితో పాటుగా, ఇశ్రాయేలీయులలోని బానిసలు కూడా విడిపింపబడే సంవత్సరము ఇదే.

ఈ రెండు ఉద్దేశములను నెరవేర్చడమునకు - అంటే భూమిని దాని వాస్తవమైన యజమానునికి తిరిగి ఇచ్చివేయడం మరియు ఇశ్రాయేలీయుల బానిసలను విడిపించడం - ప్రధానంగా ఆర్థికపరమైన పర్యవసానములు ఉన్నాయి. కాబట్టి, దేవుడు అనేకమైన సాధ్యాపసాధ్యాలను పరిగణనలోనికి తీసికొని చాలా వివరణలను ఇచ్చాడు.

### నిర్వచనము మరియు వివరణ (25:8-12)

**8మరియు ఏడు విశ్రాంతి సంవత్సరములను, అనగా ఏడేసి యేండ్లుగల సంవత్సరములను లెక్కింపవలెను. ఆ యేడు విశ్రాంతి సంవత్సరములకాలము నలుబది తొమ్మిది సంవత్సరములగును. 9ఏడవ నెల పదియవనాడు మీ స్వదేశమంతట శృంగనాదము చేయవలెను. ప్రాయశ్చిత్తార్థదినమున మీ దేశమంతట ఆ శృంగనాదము చేయవలెను. 10మీరు ఆ సంవత్సరమును, అనగా ఏబదియవ సంవత్సరమును పరిశుద్ధపరచి మీ దేశవాసులకందరికి విడుదల కలిగినదని చాటింపవలెను; అది మీకు సునాదముగా నుండును; అప్పుడు మీలో ప్రతివాడు తన స్వాస్థ్యమును తిరిగి పొందవలెను; ప్రతివాడు తన కుటుంబమునకు తిరిగి రావలెను. 11ఆ సంవత్సరము, అనగా ఏబదియవ సంవత్సరము మీకు సునాదకాలము. అందులో మీరు విత్తకూడదు కారుపంటను కోయకూడదు శుద్ధిపరచని నీ ఫలవృక్షముల పండ్లను ఏరుకొనకూడదు. 12అది సునాద కాలము; అది మీకు పరిశుద్ధమగును, పొలములో దానంతట అదే పండిన పంటను మీరు తినెదరు.**

ఈ విధముగా ఇక్కడి అంశము విశ్రాంతి సంవత్సరము నుండి సునాద సంవత్సరమునకు మారుతుంది, మరియు ఈ అధ్యాయములోని మిగిలిన వచనములన్నీ కూడా ఈ యాభైయవ సంవత్సరమునకు సంబంధించిన నిబంధనలతోనే నిండుకొని ఉంది.

**వచనము 8.** ఈ సునాద సంవత్సరము అనేది **ఏడేసి యేండ్లుగల**

**సంవత్సరములను ఏడు** సార్లు లెక్కించుట ద్వారా, మొత్తము **నలుబది తొమ్మిది సంవత్సరములు** - అనగా, "ఏబదియవ సంవత్సరము"లో జరుగుతుంది (25:10).

ఆంగ్ల అనువాదములు సూచించుచున్నట్లుగా, ఈ సునాద సంవత్సరమును ఏబదియవ సంవత్సరములో చేసేవారు అని అనేకమంది వ్యాఖ్యాతలు భావించారు. కొంతమంది ఈ ఆలోచనను ప్రశ్నిస్తారు, కారణం ఒకవేళ ఇది ఏబదియవ సంవత్సరములో జరుపబడినట్లయితే, రెండు విశ్రాంతి సంవత్సరములు ఒకదాని వెనుక వెంటనే మరొకటి రావడం జరుగుతుంది; మరియు పంటలు లేకుండా సమాజమంతయు జీవించి ఉండగలిగేవారా అని సందేహించారు వీరు. కాబట్టి, ఈ సునాద సంవత్సరము అనేది ఏడవ విశ్రాంతి సంవత్సరమునకు సమానమైనదిగా, లేదా నలుబది తొమ్మిదవ సంవత్సరములో జరుపబడినదిగా సూచించారు, మరియు ఏబదియవ సంవత్సరము అని చెప్పినప్పుడు దీనిలో కాలమును "కలిపి" లెక్కించి ఉంటారు అని చెప్పారు. ఈ ఆలోచనను వివరించిన తరువాత, సునాద సంవత్సరము అనేది నలుబది తొమ్మిది దినములు మాత్రమే జరుపబడే ఒక చిన్న వత్సర వేడుక, ఇది నలుబది తొమ్మిదవ సంవత్సరమునకు వెంటనే జరుపబడేది అనే ఆలోచనను Gordon J. Wenham అనే రచయిత వ్యక్తపరచాడు. ఇట్టి ఒక చిన్న "వత్సరము" వెంటవెంటనే రెండు విశ్రాంతి సంవత్సరములను ఆచరించకుండనే సునాద సంవత్సరమునకు సంబంధించిన ఉద్దేశములను నెరవేర్చుటకు దోహదపడేది.[5] ఈ ప్రతిపాదనలు ఉన్నప్పటికీ, ఈ సునాద సంవత్సరమును పూర్తి సంవత్సరముగా మరియు ఏబదియవ సంవత్సరముగానే చూడడం శ్రేష్ఠం.

**వచనము 9.** దేశమంతటిలో **శృంగనాదము** చేయడముతో ఈ సునాద సంవత్సరమును ప్రకటన చేయాలి అని చెప్పబడింది. **ఏడవ నెల పదియవనాడు శృంగనాదము** చేయుట ద్వారా ఈ సునాద సంవత్సరము ప్రారంభమౌతుంది. ఇది రానున్న సంవత్సరములో సాధారణముగా పంటలను విత్తుకాలమునకు కొద్దిగా ముందు దినములలో చోటుచేసుకొనేది. వ్యవసాయ సంవత్సరముతో బాటుగా శరదృతువులో విశ్రాంతి సంవత్సరము ప్రారంభమావ్వగా, సునాద సంవత్సరము కూడా శరదృతువులోనే ప్రారంభమయ్యేది.

**వచనము 10.** ఈ సునాద సంవత్సరము యొక్క ప్రధానమైన ఉద్దేశము **దేశవాసులకందరికి విడుదల కలిగినదని చాటిం**చుటకు. "విడుదల" అనే మాటకు బదులుగా, NKJV అనువాదములో דְּרוֹר (*డియోరోర్*) అను హెబ్రీ పదమును "స్వాతంత్ర్యము"గా అనువదించింది.

ఈ వచనము యొక్క తరువాత భాగమునకు NASB అనువాదములో ఈ విధంగా ఉంది: ***మరియు* మీలో ప్రతిఒక్కడు తన సొంత స్వాస్థ్యమునకు వెళ్ళవలెను, *మరియు* ప్రతివాడు తన కుటుంబమునకు వెళ్ళవలెను** (వక్కాణం చేర్చబడెను). "మరియు" అనే మాటకు బదులు, "అప్పుడు" అనే మాటను కూడా ప్రయోగించవచ్చు: "*అప్పుడు* మీలో ప్రతివాడు తన సొంత స్వాస్థ్యమునకు వెళ్ళవలెను, *అప్పుడు* ప్రతివాడు తన కుటుంబమునకు వెళ్ళవలెను." ఈ "విడుదల" లేదా "స్వాతంత్ర్యము" అనేది ప్రజలు తమ "స్వాస్థ్యమునకు" మరియు "కుటుంబమునకు" వెళ్ళునట్లు అనుమతిస్తుంది. వారు తమ సొంత స్వాస్థ్యమునకు తిరిగి వెళ్ళడం ద్వారా అసలు

యజమానులచే ఆ భూమి తిరిగి పొందుటకు దారితీస్తుంది; మరియు తమ కుటుంబములకు తిరిగి వెళ్ళడం ద్వారా తమ దేశపు నివాసులకు ఇశ్రాయేలీయులు నిత్యము బానిసలుగా ఉండకుండా వారు విడిపింపబడుటకు నడిపిస్తుంది. ఈ విడుదలలు కలిసి ఇశ్రాయేలు **సునాదమును** అనుభవించునట్లు చేస్తాయి.

**వచనములు 11, 12.** వారు విశ్రాంతి దినమును ఆచరించిన విధానములోనే దీనిని కూడా ఆచరించాలి. వారు **పంటలను** విత్తడము గాని లేదా కోయడము గాని చేయకూడదు, కాని వాటంతట అవిగా భూమిలో మొలిచిన పంటను మాత్రము వారు తినవచ్చు.

సునాద సంవత్సరమును గూర్చిన అత్యంత ప్రాముఖ్యమైన వాస్తవమేమనగా ప్రజలు దీనిని "ప్రతిష్ఠపరచాలి" (25:10) లేదా దానిని **పరిశుద్ధము**గా ఎంచాలి. మరొక విధంగా చెప్పాలంటే, దేవుడైన యెహోవాను ఘనపరచుటకు ఈ సంవత్సరము ప్రత్యేకపరచబడినదిగా ఉండాలి. కొన్ని విధానాలలో, అది ఆయన పరిశుద్ధతను ప్రతిబింబిస్తుంది; కాబట్టి, అది "పరిశుద్ధ" సంవత్సరము.

### మూల నియమము (25:13-17)

**[13]ఆ సునాద సంవత్సరమున మీలో ప్రతివాడు తన స్వాస్థ్యమును మరల పొందవలెను. [14]నీవు నీ పొరుగువానికి వెలకు ఇచ్చిన దేని విషయములోకాని నీ పొరుగువాని దగ్గర నీవు కొనిన దేని విషయములో కాని మీరు ఒకరినొకరు బాధింపకూడదు. [15]సునాద సంవత్సరమైన తరువాత గడచిన యేండ్ల లెక్క చొప్పున నీ పొరుగువానియొద్ద నీవు దానిని కొనవలెను. పంటల లెక్కచొప్పున అతడు నీకు దానిని అమ్మవలెను. [16]ఆ సంవత్సరముల లెక్క హెచ్చినకొలది దాని వెల హెచ్చింపవలెను, ఆ సంవత్సరముల లెక్క తగ్గినకొలది దాని వెల తగ్గింపవలెను. ఏలయనగా పంటల లెక్కచొప్పున అతడు దాని నీకు అమ్మెను గదా. [17]మీరు ఒకరి నొకరు బాధింపక నీ దేవునికి భయపడవలెను. నేను మీ దేవుడనైన యెహోవాను.**

"ఒకవేళ . . ." అనే మాటతో మొదలయ్యే ప్రజల ప్రశ్నలకు దేవుడు స్పందిచే ముందు, ఇవ్వబడిన నిబంధనలు దేనిని అమలుపరచాలని ఉద్దేశించబడినవో ఆ మూల నియమమును ఉచ్చరించాడు. అధ్యాయములోని ఈ భాగములో ఉన్న నిబంధనలను 17వ వచనములో గల ప్రబలమైన నియమము వెలుగులో అర్థము చేసుకోవాలి: వారు "[తమ] దేవునికి భయపడి" మరియు "ఒకరి నొకరు బాధించుకొన కూడదు."

**వచనము 13. సునాద సంవత్సరము** యొక్క ప్రధానమైన ఉద్దేశమును చెప్పడం ద్వారా దేవుడు ప్రారంభించాడు: **మీలో ప్రతివాడు తన స్వాస్థ్యమును మరల పొందవలెను.** ఇశ్రాయేలు కనాను దేశమును స్వాధీనపరచుకొనినప్పుడు, అది పండ్రెండు గోత్రముల మధ్య విభజించబడింది. ఆ గోత్రములలోనే, స్వాస్థ్యముగా ప్రతి కుటుంబము కొంత భూమిని పొందుకొనినది. ఇశ్రాయేలు వాగ్దాన దేశములో స్థిరపడినప్పుడు పొందిన ఆ స్వాస్థ్యమును ప్రతి కుటుంబము కూడా ఉంచుకొనే

ఉద్దేశముతోనే ఈ చట్టము చేయబడింది. కాబట్టి, ఒక కుటుంబము ఆ స్వాస్థ్యమును ఒకవేళ అమ్మివేసినట్లయితే, సునాద సంవత్సరములో మాత్రము ఆ కుటుంబము యొక్క స్వాస్థ్యమును అది పొందాలి.

**వచనములు 14-16.** ఒక ఇశ్రాయేలీయుడు తన భూమిని అమ్మవలసివస్తే, అతడు మరియు ఆ భూమిని కొనినవాడు కూడా ఈ నియమముతోనే జీవించాలి: **మీరు ఒకరినొకరు బాధింపకూడదు** (25:14). పొరుగువానిని బాధించే అవకాశము తరువాత రెండు వచనములలో వివరించిన అనిశ్చిత విషయాల్లో చెప్పబడింది: సునాద సంవత్సరమునకు పది సంవత్సరములు ముందు ఒక ఇశ్రాయేలీయుడు తోటి ఇశ్రాయేలీయునికి పూర్తి ధరకు తన స్వాస్థ్యమును అమ్మి మరియు సునాద సంవత్సరములో దానిని తిరిగి పొందినట్లయితే, ఆ సదరు కొనుగోలుదారుడు బాధింపబడినట్లు.

ఇట్టివి సంభావించకుండా ఉండునట్లు, ఏబది సంవత్సరముల కాలములో ఆ సదరు భూమిలో ఎంత **పంట** పండగలదో దాని విలువపై ఆధారపడి కొనుగోలుదారుడు మరియు అమ్మకపుదారుడు ఇరువురు కూడా ఆ స్వాస్థ్యము యొక్క విలువపై ముందుగానే ఒక అంగీకారమునకు రావాలి. అప్పుడు కొనుగోలుదారుడు ఆ వెలలో కొంత భాగమును, అంటే మరొక సునాద సంవత్సరమునకు మరింక ఎన్ని సంవత్సరములు మిగిలి ఉన్నవో అని లెక్కించి (25:15, 16) దానిని చెల్లించాలి. నిజానికి, ఈ "కొనుగోలుదారుడు" ఆ స్వాస్థ్యమునకు యజమానుడు కాడు; కానీ, రాబోయే ఆ సునాద సంవత్సరములోగా ఆ భూమి ఎంతటి పంటనైతే పండించగలదో ఆ వెలను ముందుగానే ఆ స్వాస్థ్యము యొక్క శాశ్వత యజమానునికి చెల్లించాడు. కాగా ఆయన యొక్క "యజమానత్వము" అనేది ఆ భూమిని సొంతంగా కొనివేయుట ద్వారా వచ్చినదికంటే ఒక రకమైన లీజుగా ఉంది.

ఫలితముగా, ఈ నియమము ఆ దేశములోని నివాసుల మధ్య గల ఆర్థిక వ్యత్యాసములను తగ్గించునట్లుగా ఇవ్వబడింది. ప్రాచీన కాలములో, సంపదను కూర్చుకొనుట అనేది భూమిని స్వాధీనపరచుకొని తనవద్దనే ఉంచుకొనుట ద్వారా కలిగేది. సంపన్న కుటుంబాలు పెద్ద పెద్ద ఆస్థానములను కలిగి ఉండేవి. గొప్ప గొప్ప విస్తీర్ణతగల భూములను వ్యక్తులు కూడబెట్టుకొనకుండా ఈ చట్టము అరికట్టేది. కాబట్టి, దీని ప్రయోగము ఇశ్రాయేలు సమాజములో గొప్ప సమానత్వమునకు దారితీసింది.

**వచనము 17.** ఈ పేరాలోని ఆఖరు వచనము భూమిని క్రయవిక్రయము చేసినప్పుడు ఇశ్రాయేలీయులు తోటివారిని బాధించకుండా ఎలా ఉండాలో అనేదానికి మూడు కారణములను ఇస్తుంది: (1) వారు **ఒకరి నొకరు బాధింప**కూడదు. (2) **దేవుని** పట్ల **భయము** (లేదా భక్తి) అనేది వారిని విధేయతలోనికి నడిపించాలి. దేవుడు పేదవారిని గూర్చి చింతించువాడు. ఎవరైనా ఇతరుల పట్ల దురుసుగా ప్రవర్తించినా లేదా వారి మీద బలప్రయోగము చేసినా (ఆ వ్యక్తి కొనుగోలుదారుడైనా లేదా అమ్మకపుదారుడైనా) ప్రత్యేకముగా పేదయైన వానిని అలా చేస్తే, వారు దేవునిచే శిక్షించబడే ప్రమాదములో ఉన్నారు. (3) **యెహోవాయే** వారి **దేవుడు**. కాబట్టి వారు ఆయనను గౌరవించి ఆయన వాక్కుకు విధేయులు కావలి; అంటే దేవుడు చూసినట్లుగా పేదలను కరుణతో చూడడం కూడా ఇందులో భాగమే.

సునాద సంవత్సరమునకు సంబంధించి వారు చేసే వ్యాపార లావాదేవీలలో దేవుని ప్రజలు "ఇతరులను బాధించకుండా" ఉండునట్లు ఇక్కడ పొందుపరచబడియున్న నియమములు ఇవ్వబడినవి. వారు యెహోవాకు భయపడువారనియు మరియు ఆయననే వారి దేవునిగా వారు గుర్తిస్తున్నారనియు వారు చేసే వ్యాపార లావాదేవీల ద్వారా తెలియునట్లుగా వారు తమ వ్యాపారమును జరిగించాలి.

## ఆజ్ఞలు మరియు వాగ్దానములు (25:18-22)

**[18]కాబట్టి మీరు నా కట్టడలను నా విధులను గైకొని వాటి ననుసరించి నడుచుకొనవలెను. [19]అప్పుడు మీరు ఆ దేశములో సురక్షితముగా నివసించెదరు, ఆ భూమి ఫలించును. మీరు తృప్తిగా భుజించి దానిలో సురక్షితముగా నివసించెదరు. [20]ఏడవ యేట మేము ఏమి తిందుము? ఇదిగో మేము చల్లను పంటకూర్చను వల్లగాదే అనుకొందురేమో. [21]అయితే నేను ఆరవయేట నా దీవెన మీకు కలుగునట్లు ఆజ్ఞాపించెదను; అది మూడేండ్ల పంటను మీకు కలుగజేయును. [22]మీరు ఎనిమిదవ సంవత్సరమున విత్తనములు విత్తి తొమ్మిదవ సంవత్సరమువరకు పాత పంట తినెదరు; దాని పంటను కూర్చువరకు పాత దానిని తినెదరు.**

సునాద వత్సరమును గూర్చి దేవుడు అధికమైన నియమములను ఇవ్వడం మొదలుపెడుతుండగా, ఆయన ఒక ఆజ్ఞను ఇచ్చాడు (25:18) మరియు దానిని ప్రజలు పాటించునట్లు చేయుటకు ధారాళమైన వాగ్దానములను కూడా చేసాడు (25:19-22).

**వచనము 18.** తన వాక్కును వినవలసినదిగా దేవుడు తన శ్రోతలను హెచ్చరించాడు. [ఆయన] **కట్టడలను** గైకొని, [ఆయన] **విధులను గైకొని** మరియు **వాటి ననుసరించి నడుచుకొనవలెను** అని చెప్పాడు. ఆయన కట్టడలు ఆచరింపబడాలి అని ఉద్దేశించాడు. దేవుడు, మరియు ఆయనకు విధేయులగునట్లు కూడా తన ప్రజలకు ప్రోత్సాహకాలను ఇచ్చాడు. ఈ విషయములో, మూడు వాగ్దానములను ఆయన చేసాడు.

ఈ నియమములను ఇశ్రాయేలు పాటించునట్లు చేయుటకు దేవుడు వారికి చేసిన మొదటి వాగ్దానము కనాను దేశములో భద్రత. వారు ఆయనకు విధేయులైనట్లయితే, ఆయన వారికి ఇచ్చునట్టి ఆ **దేశములో సురక్షితముగా నివసిస్తారు**. ఈ వాగ్దానములో వినాశనాత్మకమైన బలముల నుండి భద్రత మరియు వ్యవసాయ సంబంధమైన పనులలో జయము అనేవి కూడా సూచించబడ్డాయి.

**వచనము 19.** తరువాత, ఇశ్రాయేలు ఆయనకు విధేయులు అయితే, ఆయన ప్రజలు సమృద్ధియైన పంటలను ఆనందించి తద్వారా [తమకు] **తృప్తిగా భుజించి** మరియు ఆ దేశములో **సురక్షితముగా నివసిస్తారు**.

**వచనములు 20-22.** మూడవదిగా, ఇశ్రాయేలీయులు విశ్రాంతి సంవత్సరమును ఆచరించుట వలన వారికి లేమి కలుగకుండునట్లుగా వారికి పోషణ యిస్తాను అని

దేవుడు వాగ్దానము చేసాడు.

దేవుడు వారికి విధించిన నియమముల విషయములో సద్భక్తిగల ఇశ్రాయేలీయులకైనా సరే కొన్ని ప్రశ్నలు ఉంటాయి అని గుర్తించాడు. **ఏడవ యేట మేము ఏమి తిందుము? ఇదిగో మేము చల్లను పంటకూర్చను వల్లగాదే** అని వారు ప్రశ్నించవచ్చు (25:20). సునాద సంవత్సరము వచ్చినప్పుడు ఈ ప్రశ్న మరింత బలమైనదిగా ఉంటుంది, ఎందుకంటే వెంటవెంటనే రెండు విశ్రాంతి సంవత్సరములను వారు పాటించవలసి ఉంటుంది. ఈ విషయములో దేవుని వాగ్దానము ఏమంటే **ఆరవ సంవత్సరములో** ప్రజలు ఎంతటి సమృద్ధియైన పంటను అనుభవిస్తారు అంటే అది **మూడు సంవత్సరములకు** సరిపడునంతగా ఉంటుంది (25:21), అంటే **ఎనిమిదవ సంవత్సరములో** వారు నాటే **పంటను** వారు **తొమ్మిదవ సంవత్సరములో** తినునంత వరకు అది సరిపోతుంది అని చెప్పాడు (25:22).

అభ్యాససిద్ధంగా ఈ వాగ్దానము ఎలా పనిచేస్తుందో అర్థము చేసుకోవడం కష్టమే. ఈ వచనములు సంవత్సరములను ("ఆరవ," "ఏడవ," "ఎనిమిదవ," మరియు "తొమ్మిదవ") పవిత్రమైన క్యాలెండరు అనుసరించి, అంటే సంవత్సరమును వసంత కాలములో ప్రారంభించి పేర్కొన్నాయి అని సూచిస్తూ ఈ పరిస్థితిని గూర్చిన వివరణను వ్యాఖ్యాతలు ఇచ్చారు, కాగా విశ్రాంతి సంవత్సరము మరియు సునాద సంవత్సరము రెండూ కూడా శరదృతువు నుండి లెక్కించేవారు. ఇదే ఇక్కడ జరిగి ఉంటుంది అని అనుకొంటే, ఈ క్రింది కాలక్రమము ఈ చట్టములో ఉన్నట్లుగా అనిపిస్తుంది:

*అయిదవ (పవిత్రమైన) సంవత్సరము*
- శరదృతువు - ఆరవ సంవత్సరమునకు విత్తుట.

*ఆరవ (పవిత్రమైన) సంవత్సరము*
- వసంత ఋతువు - మూడు సంవత్సరములకు సరిపడునంత సమృద్ధియైన పంటను కోయడం.
- శరదృతువు (విశ్రాంతి సంవత్సరము యొక్క ఆరంభము) - విత్తుట ఉండదు.

*ఏడవ (పవిత్రమైన) సంవత్సరము*
- వసంత ఋతువు (విశ్రాంతి సంవత్సరము యొక్క ముగింపు) - విత్తుట ఉండదు, కాని మూడు సంవత్సరముల పంటలలో మొదటి పంటను తినడం.
- శరదృతువు (సునాద సంవత్సరము యొక్క ఆరంభము) - విత్తుట ఉండదు.

*ఎనిమిదవ (పవిత్రమైన) సంవత్సరము*
- వసంత ఋతువు (సునాద సంవత్సరము యొక్క ముగింపు) - కోతకోయుట ఉండదు, మూడు సంవత్సరముల పంటలో రెండవ పంటను తినడం.
- శరదృతువు (విశ్రాంతి సంవత్సరము తరువాత మొదటి సంవత్సరము మరియు సునాద సంవత్సరము) - కోతకోయవలసిన పంటను విత్తడం.

*తొమ్మిదవ (పవిత్రమైన) సంవత్సరము*

వసంత ఋతువు - పంటలను కోయడం. కోతకాలము వరకు, మూడు సంవత్సరముల పంటలో మిగిలిన పంటను తినడం.[6]

ఈ విధంగా, "ఆరవ సంవత్సరము"లో కూర్చుకొనిన సమృద్ధియైన పంట ప్రజలను రెండు సంవత్సరములు మరియు మూడవ సంవత్సరములో సగభాగము పోషిస్తుంది. ఈ వాగ్దానమును పొందినవారై, సునాద సంవత్సరము విశ్రాంతి సంవత్సరము వెంటనే వచ్చినప్పటికీ కూడా ప్రజలు ఆకలితో మాత్రము ఉండరు అనే నిశ్చయతను ప్రజలు కలిగి ఉంటారు.

## భూమిని అమ్మడం (25:23-28)

**[23]భూమిని శాశ్వత విక్రయము చేయకూడదు. ఆ భూమి నాదే, మీరు నాయొద్ద కాపురమున్న పరదేశులు. [24]మీ స్వాస్థ్యమైన ప్రతి పొలము మరల విడిపింపబడునట్లుగా దాని అమ్ముకొనవలెను. [25]నీ సహోదరుడు బీదవాడై తన స్వాస్థ్యములో కొంత అమ్మిన తరువాత అతనికి సమీప బంధువుడు విడిపింప వచ్చినయెడల తన సహోదరుడు అమ్మినదానిని అతడు విడిపించును. [26]అయితే ఒకడు సమీప బంధువుడు లేకయే దాని విడిపించుకొనుటకు కావలసిన సొమ్ము సంపాదించిన యెడల [27]దానిని అమ్మినదిమొదలుకొని గడచిన సంవత్సరములు లెక్కించి యెవరికి దానిని అమ్మెనో వారికి ఆ శేషము మరల ఇచ్చి తన స్వాస్థ్యమును పొందును. [28]అతనికి దాని రాబట్టుకొనుటకై కావలసిన సొమ్ము దొరకని యెడల అతడు అమ్మిన సొత్తు సునాదసంవత్సరమువరకు కొనిన వాని వశములో ఉండవలెను. సునాదసంవత్సరమున అది తొలగిపోవును; అప్పుడతడు తన స్వాస్థ్యమును మరల నొందును.**

ఈ భాగములో, "భూమికి అసలు యజమానులుగా ఉన్నవారు ఆ భూమి యొక్క యజమానత్వమును తిరిగి పొందడం ఎలా?" అనే ప్రశ్నను పరిగణిస్తున్నాడు.

**వచనము 23.** భూమి యొక్క క్రయవిక్రయములను గూర్చిన చట్టమంతయు ఆధారితమైయున్న ఒక ప్రధాన సత్యాన్ని ప్రకటించడం ద్వారా ఈ వాక్యభాగము మొదలౌతుంది: దేవుడే **భూమి** అంతటికీ యజమానుడు! నిజానికి, వారు కనాను దేశములోనికి ప్రవేశించిన తరువాత కూడా, దేవుని ప్రజలు ఆ దేశములో కేవలము **కాపురమున్న పరదేశులు**గానే తమ్ముతాము ఎంచుకోవాలి. వారు శాశ్వత పౌరులు కారు; వారు అక్కడ కేవలము తాత్కాలికముగా మాత్రమే ఉన్నారు. కాబట్టి, భూమిలో ఏదీ కూడా **శాశ్వత విక్రయము చేయకూడదు.**

**వచనము 24.** ఆ **భూమి** దేవునికి చెందినది గనుక, దానితో ఏమి చేయాలో చెప్పుటకు ఆయనకు హక్కు ఉంది. ఇశ్రాయేలు కనాను దేశమును స్వాధీనపరచుకొనినప్పుడు జరిగిన విభజనే మరలా జరగాలనేది ఆయన ఆలోచన. దీని అర్థము ఇశ్రాయేలులో భూమిని కొనుగోలు చేసిన వారెవరైనా దానిని అమ్మిన వాడు తిరిగి విడిపించుకొనుటకు లేదా కొనుక్కొనుటకు అడిగినప్పుడు ఆ భూమిని అతనికి అప్పగించేయాలి.

ఎవరిచే ఆ భూమి విడిపింపబడవచ్చు, మరియు ఎట్టి పరిస్థితుల్లో దానిని విడిపించవచ్చు? ఒకవేళ ఆ భూమిని విడిపించకపోతే ఆ భూమికి ఏమి జరుగుతుంది? ఈ ప్రశ్నలకు తరువాత నాలుగు ప్రశ్నలు జవాబునిస్తున్నాయి.

**వాచనము 25.** ఒకని **స్వాస్థ్యము**ను మరొకనికి ఎలా అమ్మవచ్చునో ఇక్కడి వాక్యము మొదటిగా చెప్తుంది. ఒకవేళ అతడు బాగా **బీదవాడై** ఉంటే, తన స్వాస్థ్యములోని కొంతభాగమును **అమ్ము**టకు అతడు బలవంతము చేయబడవచ్చు. ఉదాహరణకు, అతడు వేరొకని దగ్గర ఎంతో అధిక మొత్తములో అప్పు తీసికొని తన స్వాస్థ్యములోని కొంత భాగము అమ్మితేనేగాని దానిని తీర్చలేని స్థితిలో ఉండవచ్చు. ఒక భూమి యొక్క యజమానుడు ఆర్థికముగా బలవంతము చేయబడితే తప్ప సదరు భూమిని అమ్మకూడదు అనేది ఇక్కడ సూచనప్రాయముగా చెప్పబడింది.

తన స్వాస్థ్యములోని కొంత భాగమును అమ్మునట్లు ఒకడు బలవంతము చేయబడితే, దానిని విడిపింపవలసిన బాధ్యత తనకు **సమీప బంధువుడు** దానిని విడిపించాలి, దానిని కొన్నవాని దగ్గర నుండి **అతడు** [దానిని] **విడిపించును.** ఒక ఇశ్రాయేలీయుడు వేరొక ఇశ్రాయేలీయుని స్వాస్థ్యమును ఎందుకు విడిపించాలి? ఎందుకంటే వారి మధ్యనున్న సమీప బంధుత్వమును బట్టి. 25వ వచనములోని **సహోదరుడు** మరియు **బంధువుడు** అనే పదాలు אָח (*అఖ్*) నుండి అనువదించబడినవే, అంటే దీనికి "సహోదరుడు" అని అర్థము (25:36, 39, 46, 47 చూడండి). వారు "సహోదరులు" గనుక, ఒక ఇశ్రాయేలీయుడు తోటి బీద ఇశ్రాయేలీయునికి సహాయపడాలి. బహుశా, తన స్వాస్థ్యమును అమ్మినవాడు తిరిగి తన స్వాస్థ్యమునకు తిరిగి వెళ్లి దానిని తిరిగి ఉపయోగించుకొనుటకు అనుమతించబడతాడు. కాగా అతడు తిరిగి ఆర్థికముగా బలపడినప్పుడు తన స్వాస్థ్యమును విడిపించిన సహోదరునికి తిరిగి చెల్లించ బద్ధుడైయున్నాడా? వాక్యము ఈ విషయముపై ఏమీ చెప్పుటలేదు.

**వచనములు 26, 27.** ఒకవేళ ఆ స్వాస్థ్యమును అమ్మినవానికి **సమీప బంధువుడు** లేకుండినట్లయితే, తన పరిస్థితులు బలపడినప్పుడు తనంతట తానుగా ఆ స్వాస్థ్యమును తిరిగి విడిపింపవలసిన (తిరిగి కొనవలసిన) బాధ్యత తనపై ఉంది. తన నుండి ఆ స్వాస్థ్యమును కొనిన వానిపట్ల మంచిగా ఉండాలి, ఆ భూమికి ఇచ్చిన వెలను మరియు తరువాత సునాద సంవత్సరమునకు మధ్య ఉన్న కాలమును జ్ఞాపకము ఉంచుకోవాలి. ఆ భూమిని తిరిగి కొనేటప్పుడు, ఆ కొనుగోలుదారుడు అప్పటికే దానిలో పండిస్తున్న పంటను అతడు నాటలేదుగనుక మరియు అమ్మకూడదు గనుక దానికి సరిపడు వెలను తిరిగి చెల్లించాలి.

**వచనము 28.** అయినప్పటికీ, తన స్వాస్థ్యమును విడిపించుటకుగాను అవసరమగు ధనమును సదరు అమ్మకపుదారుడు కూర్చుకొనలేని పరిస్థితి వస్తే, **సునాద సంవత్సరము వరకు** ఆ కొనుగోలుదారుడు ఆ స్వాస్థ్యమును తన వద్దనే ఉంచుకొంటాడు. ఆ సమయములో, ఆ స్వాస్థ్యము అమ్మినవాని దగ్గరకు **మరల** చేరుతుంది. "మరల" అనే మాట יָצָא (*యట్సా*) అనే పదము నుండి అనువదింపబడినది, దీని అక్షరార్థము "బయటకు వెళ్లిపోవుట."

**ఇండ్లను క్రయము చేయుట (25:29-34)**

**[29]ఒకడు ప్రాకారముగల ఊరిలోని నివాసగృహమును అమ్మినయెడల దాని అమ్మినదినము మొదలుకొని నిండు సంవత్సరములోగా దాని విడిపింపవచ్చును; ఆ సంవత్సర దినములోనే దాని విడిపించుకొనవచ్చును. [30]అయితే ఆ సంవత్సరదినములు నిండకమునుపు దాని విడిపింపనియెడల ప్రాకారముగల ఊరిలోనున్న ఆ యిల్లు కొనినవానికి వాని తరతరములకు అది స్థిరముగానుండును. అది సునాద కాలమున తొలగిపోదు. [31]చుట్టును ప్రాకారములులేని గ్రామములలోని యిండ్లను పెలిపొలములుగా ఎంచవలెను. అవి విడుదల కావచ్చును; అవి సునాదకాలములో తొలగిపోవును. [32]అయితే లేవీయుల పట్టణములు, అనగా వారి స్వాధీన పట్టణములలోని యిండ్లను విడిపించుటకు అధికారము లేవీయులకు శాశ్వతముగా ఉండును. [33]లేవీయుల పట్టణముల యిండ్లు ఇశ్రాయేలీయుల మధ్యనున్న వారి స్వాస్థ్యము గనుక ఒకడు లేవీయులయొద్ద ఇల్లు సంపాదించిన యెడల పిత్రార్జిత పట్టణములో అమ్మబడిన ఆ యిల్లు సునాదసంవత్సరమున తొలగిపోవును. [34]వారు తమ పట్టణముల ప్రాంతభూములను అమ్ముకొనకూడదు; అవి వారికి శాశ్వత స్వాస్థ్యము.**

భూమి క్రయమును గూర్చిన కట్టడలను ఇచ్చిన తరువాత, ఇండ్లను అమ్ముటకు గల నియమములను దేవుడు అందించాడు. సుస్పష్టముగా, ఈ చట్టము "ఒకవేళ నాకు భూమి లేకయే ఉండి నా ఇల్లును అమ్మాలని అనుకొంటే సునాద సంవత్సరమును గూర్చిన నియమములు నన్ను ఎలా ప్రభావితము చేస్తాయి?" అనేటువంటి ఇతర ప్రశ్నలను కూడా లేవనెత్తవచ్చు. ఇండ్లను అమ్ముటను గూర్చి ఇవ్వబడిన నియమములు మూడు భాగాలుగా విభజించబడ్డాయి: (1) ప్రాకారము గల పట్టణములలోని ఇండ్లు, (2) గ్రామములలోని ఇండ్లు, మరియు (3) లేవీయుల పట్టణముల ఇండ్లు.

**వచనములు 29, 30. ప్రాకారముగల ఊరిలోని నివాసగృహమును** ఒక ఇశ్రాయేలీయుడు అమ్మినట్లయితే, దానిని విడిపించుటకు ఆయనకు ఒక **సంవత్సరము** ఉంటుంది - తనంతట తానుగా దానిని విడిపించుకొనుటకు లేదా తన కొరకు తన సమీప బంధువు దానిని విడిపించుటకు. ఆ కాలములో ఆ వ్యక్తి దానిని విడిపింపకపోయిన యెడల, అతనికి అమ్మిన ఆ వ్యక్తికే అది శాశ్వత ఆస్తి అయిపోతుంది. **సునాద సంవత్సరములో** దాని అసలు యజమానుని వద్దకు [అది] **తొలగిపోదు.** అట్టి ఇల్లు భూమి వంటిది కాదు; దానిని అసలు సొంతము చేసుకొనిన ఆ కుటుంబము యొక్క శాశ్వత స్వాస్థ్యముగా ఇల్లు పరిగణించబడేది కాదు. విడిపించుకొనుటకు ఒక సంవత్సర కాలము ఇవ్వబడిన హక్కుతో పాటుగా, మరి ఏ ఇతర ఆస్తివలేనే కూడా అది అమ్మవచ్చును మరియు కొనవచ్చును.

**వచనము 31.** దీనికి విరుద్ధముగా, **చుట్టును ప్రాకారములులేని గ్రామములలోని ఇండ్లను** కూడా ఇదే కోవలో పెట్టి **పెలిపొలము**గా పరిగణించారు. వాటిని కూడా శాశ్వతముగా అమ్మకూడదు. అవి అమ్మబడినయెడల, అసలు యాజమానునికి

**విడిపించే** హక్కు ఉంటుంది; ఒకవేళ అవి విడిపింపబడకపోయినట్లయితే, **సునాద సంవత్సరములో** అట్టి ఇండ్లయొక్క యజమానత్వము వాటిని అమ్మినవారికి తిరిగి వచ్చేస్తుంది.

ప్రాకారములుగల పట్టణములలోని ఇండ్లకును మరియు గ్రామములలోని ఇండ్లకును గల వ్యత్యాసమును వాక్యము వివరించుట లేదు. బహుశా, ఇండ్లను కలిగియున్నా ఆయా యజమానుల యొక్క ఆర్థిక స్థితిపై ఆ వ్యత్యాసము ఆధారపడి ఉండేది. ప్రాకారములుగల పట్టణములలోని ఇండ్లు గల వారు కొంత సంపన్నులుగా ఉండే అవకాశము ఉంది, సమాజములోని ఉన్నత వర్గమునకు చెందినవారిగా ఉండి ఉంటారు. జీవితములో సంభవించే మార్పుల నుండి వారికి భద్రత అవసరము లేనట్లుంది. అట్టి కుటుంబము తమకు పట్టణములో ఉన్న ఒక మంచి ఇల్లును అమ్మినయెడల, వారు మరొక ఇంటిని సునాయాసముగా కొనగలరు. మరొక వైపు చూస్తే, గ్రామములలో నివసించేవారు ఎక్కువగా బీదలుగా ఉంటారు. తమ ఇండ్లను అమ్మునట్లుగా వారు బలవంతము చేయబడినప్పుడు, వారు గత్యంతరము లేకయే అమ్ముతారు. బీదలకు భద్రత కలుగు విధముగా బహుశ దేవుడు ఒక విధంగా ఈ కట్టడను చేసి ఉంటాడు.

**వచనములు 32-34. లేవీయులు** అనేవారు తమ సొంత కోవలోనే వారు ఉన్నారు. పండ్రెండు గోత్రములలో ప్రతియొక్క గోత్రము కూడా కొద్ది భూమి ఇవ్వబడింది,[7] కాని లేవీ అనబడే యాజక గోత్రము మాత్రము ఇశ్రాయేలులో పరివ్యాప్తించియున్న నలుబది ఎనిమిది పట్టణములు ఇవ్వబడ్డారు (సంఖ్యా. 35:7; యెహో. 21:41). ప్రత్యక్ష గుడారమును చూచుకొంటూ యెహోవాను సేవించడమే లేవీయుల పని, అందులో వారు కార్యక్రమములను జరిగించి బలులను అర్పించేవారు. భూమిని సేద్యపరచుట ద్వారా జీవించుటకు బదులు, ప్రత్యక్షగుడారములోనికి తేబడిన బలుల ద్వారా మరియు ఇతర బహుమతుల ద్వారా వారు పోషింపబడేవారు. (లేవీయుల పట్టణముల ప్రాంతభూములలో మొలచే పంటలకు ఈ పోషణ అనేది అదనము.) మోషే యొక్క ధర్మశాస్త్రము ద్వారా దేవుడు తన ప్రజలతో వ్యవహరించునంత కాలము కూడా ఈ విధమైన ఏర్పాటు కొనసాగాలని దేవుడు ఆశించాడు, కాబట్టి లేవీయుల యొక్క స్వాస్థ్యములలో దేనినీ కూడా శాశ్వతముగా అమ్మకుండునట్లు ఎందుకు ఆజ్ఞ ఇచ్చాడో స్పష్టమౌతుంది.

ఫలితముగా, **లేవీయుల పట్టణములు** అమ్ముటకు అనుమతించబడినప్పటికీ, [ఆయా] **యింఢ్లను విడిపించుటకు అధికారము లేవీయులకు శాశ్వతముగా ఉండును** (25:32). ఒకవేళ ఆ ఇండ్లు విడిపింపకపోతే, **సునాద సంవత్సరములో** ఆ ఇండ్లు అసలు యజమానుల వద్దకు తిరిగి వచ్చేస్తాయి (25:33). లేవీయుల యొక్క **పట్టణముల ప్రాంతభూములు** యాజకుల స్వాస్థ్యము గనుక, పట్టణములలోని ఇండ్లవలే కాక, ఎప్పటికినీ **అమ్ముకొనకూడదు.** దేవుడు మొదటిలో వాటిని ఎవరికైతే ఇచ్చాడో వారికే అవి **శాశ్వత స్వాస్థ్యముగా** ఉంటాయి (25:34).

## బీదరికముతో వ్యవహరించుట మరియు బానిసత్వమును అరికట్టుట (25:35-38)

**[35]పరవాసియైనను అతిథియైనను నీ సహోదరుడొకడు బీదవాడై నిరాధారుడై నీయొద్దకు వచ్చినయెడల నీవు వానికి సహాయము చేయవలెను; అతడు నీవలన బ్రదుకవలెను. [36]నీ దేవునికి భయపడి వానియొద్ద వడ్డినైనను తీసికొనకూడదు; నీ సహోదరుడు నీవలన బ్రదుకవలెను. [37]నీ రూకలు వానికి వడ్డికియ్యకూడదు; నీ ఆహారమును వానికి లాభమున కియ్యకూడదు. [38]నేను మీకు కనాను దేశమునిచ్చి మీకు దేవుడగునట్లు ఐగుప్తుదేశములోనుండి మిమ్మును రప్పించిన మీ దేవుడనైన యెహోవాను.**

బీదవాడైన ఒక ఇశ్రాయేలీయుని విషయములో ఏమి చేయవలెనో దేవుడు తరువాత నిర్దేశములను ఇచ్చాడు.

**వచనము 35.** ఇశ్రాయేలీయులలో ఒకడు **బీదవాడై, నిరాధారుడై** ఉంటే, అప్పుడు అతడు ఇతర ఇశ్రాయేలీయులతో **బ్రదుకునట్లుగా** ఇశ్రాయేలీయులు వానికి **సహాయము చేయాలి**. వేరొక మాటలలో చెప్పాలంటే, తన స్నేహితులతో మరియు కుటుంబముతో అతడు స్వతంత్రముగా బ్రదుకునట్లుగా మరియు బానిసగా అమ్మబడి తన యజమానునితో జీవించుటకు కొనిపోబడకుండునట్లుగా వారు అట్టి బీదవానిని గూర్చి పట్టించుకోవాలి. తన దేశీయులు,[8] లేదా తోటి ఇశ్రాయేలీయులు, వానిని గూర్చి పట్టించుకొంటూ వాని అవసరతలు తీర్చాలి. ఆశక్తికరముగా, ఆ బీద ఇశ్రాయేలీయుడు ఒక **పరదేశిగా లేదా అతిధిగా** వారిమధ్య బ్రదుకుతాడు. తమ మధ్య నివసించే పరదేశులను అలాగే తమ మధ్యలో నివసించే బీదలను కూడా దేవుని ప్రజలు పోషించాలి.

**వచనములు 36, 37.** బీదవానిని పోషించే మార్గమును దేవుడు ప్రజలకు ఇచ్చాడు: (1) **వానిదగ్గర వడ్డినైనను** వారు తీసికొనకూడదు. NASB అనువాదములో **అధికముగా వసూలు** చేసే "వడ్డి," అంటే ఎక్కువ కానంత కాలము వడ్డిని వసూలు చేయవచ్చు అనే అర్థములో అనువదించారు.[9] వాస్తవమేమంటే తమ తోటి ఇశ్రాయేలీయుల నుండి ఎట్టి వడ్డినైనను కూడా తీసికొనకుండ ఇశ్రాయేలీయులు నిషేధించబడ్డారు (నిర్గమ. 22:25; ద్వితీ. 23:19, 20).[10] (2) వారు తమ **రూకలు వానికి వడ్డికియ్యకూడదు.** (3) వారు అతనికి ఆహారమును **లాభమున కియ్యకూడదు**, అంటే తనకివ్వబడే ఆహారమును వాడు ఉచితముగానే భుజించాలి అని అర్థము.

**వచనము 38. యెహోవా**యే తననుతాను వారికి **దేవుడు**గా, అంటే [వారిని] **ఐగుప్తుదేశములోనుండి రప్పించిన** దేవునిగా ప్రకటించుకొనిన వాక్యము ద్వారా తమ మధ్యలోనున్న బీదవారికి ఇశ్రాయేలీయులు సహాయము చేయవలసినదిగా ప్రోత్సహించబడ్డారు. వారు కూడా యెహోవాచే పోషింపబడ్డారు అనే సత్యము వారికి జ్ఞాపకము చేస్తుంది ఈ మాట; కాబట్టి, దేవుని ప్రజలలో భాగమైన వారిని కూడా వీరు సంతోషముతో పోషించాలి.

ఈ షరతులు చాల సులువుగానే ఉన్నాయి; కాని “వీటికిని మరియు సునాద సంవత్సరమునకు గల సంబంధము ఏమిటి?” అని చదువరి ఆశ్చర్యపడుతుండవచ్చు. సునాద సంవత్సరమునకు గల ఉద్దేశములలో ఒకటి బంధకములో ఉన్నవారిని విడిపించడం - అంటే బంధింపబడినవారిని, బానిసలుగా చేయబడిన వారిని విడిపించడం. ఈ కట్టడ బానిసత్వమును గూర్చి ఎట్లు మాట్లాడుతుందంటే తమ మధ్యలోని తోటి ఇశ్రాయేలీయుడు బానిస కాకుండా ఉండుటకు దేవుని కుటుంబములోని వారంతా తాము చేయగలిగినంత సహాయమును చేయాలి అని ఈ కట్టడ కోరుతుంది. బానిసత్వమును అరికట్టుటకు ఒక ప్రణాళికను ఈ పేరా కలిగియుంది.

## బానిసత్వముతో వ్యవహరించడం (25:39-46)

**39నీయొద్ద నివసించు నీ సహోదరుడు బీదవాడై నీకు అమ్మబడినయెడల వానిచేత**
**బానిససేవ చేయించుకొనకూడదు. 40వాడు జీతగానివలెను పరవాసివలెను నీయొద్ద**
**నివసించు సునాదసంవత్సరమువరకు నీ యొద్ద దాసుడుగా ఉండవలెను.**
**41అప్పుడతడు తన పితరుల స్వాస్థ్యమును మరల అనుభవించునట్లు తన**
**పిల్లలతోకూడ నీయొద్దనుండి బయలుదేరి తన వంశస్థులయొద్దకు తిరిగి వెళ్లవలెను.**
**42ఏలయనగా వారు నాకే దాసులైయున్నారు, నేను ఐగుప్తులో నుండి వారిని**
**రప్పించితిని; దాసులను అమ్మినట్లు వారిని అమ్మకూడదు; 43నీ దేవునికి భయపడి**
**అట్టివానిని కఠినముగా చూడకుము. 44మీ చుట్టుపట్లనున్న జనములలో నుండి**
**దాసీలను దాసులను కొనవచ్చును. 45మరియు మీ మధ్య నివసించు పరదేశులను నీ**
**దేశములో వారికి పుట్టిన వారిని కొనవచ్చును; వారు మీ సొత్తగుదురు. 46మీ తరువాత**
**మీ సంతతివారికి స్వాస్థ్యముగా ఉండునట్లు మీరు ఇట్టివారిని స్వతంత్రించుకొనవచ్చును; వారు శాశ్వతముగా మీకు దాసులగుదురు కాని, ఇశ్రాయేలీయులైన మీరు సహోదరులు గనుక ఒకని చేత ఒకడు కఠినసేవ చేయించుకొనకూడదు.**

సునాద సంవత్సరములో బానిసలను విడిపించాలి గనుక, బానిసత్వము అనే విషయమును గూర్చి దేవుడు స్పష్టత ఇచ్చాడు. ఇశ్రాయేలులో ఎవరు బానిసలు కాగలరు? సునాద సంవత్సరములో ఎట్టి బానిసలు విడిపింపబడాలి? ఇశ్రాయేలీయులు శాశ్వతముగా కొంతమంది బానిసలను ఉంచుకొనవచ్చా? ఈ క్రింది వచనములు ఇట్టి ప్రశ్నలకు సమాధానమిస్తున్నాయి.

**వచనములు 39-43.** మునుపటి వాక్యభాగపు అంశాన్ని 39వ వచనము కొనసాగిస్తుంది: ఇశ్రాయేలీయుడు ఒకడు **బీద**వాడైనప్పుడు ఏమి జరుగుతుంది. ఈ విషయములో, పేదరికము అనేది చాలా తీవ్రముగా ఉన్నది: ఇక్కడ ప్రస్తావించబడుతున్న వ్యక్తి ఎంతటి పేదవాడు అంటే అతనిని పోషించాలని ఇతరులు చేసే ప్రయత్నాలు సరిపోతున్నవి కావు అనునంత. ఫలితముగా, తననుతాను తోటి ఇశ్రాయేలీయునికి అమ్ముకొనవలసి వస్తుంది.

ఈ విధంగా ఒక ఇశ్రాయేలీయుడు బానిస లేదా జీవితకాల బందీ అయితే, అతడు ఎలా వ్యవహరించబడాలి? సునాద సంవత్సరములో అతనికి ఏమి జరగాలి? దేవుని యొక్క సందేశము చాలా స్పష్టము: ఇశ్రాయేలీయుడైన బానిసను ఒక బానిసలా చూడకూడదు. కాని, తన కొరకు పని చేయునిమిత్తము అతనిని ఒకరు పెట్టుకొనిన ఒక **జీతగానివలె మరియు పరవాసివలె** అతనిని చూడవలె (25:40). వానిని **కఠినముగా** చూడకూడదు (25:43).

ఇశ్రాయేలీయుడైన ఒక బానిస యజమానికి మరియు ఇశ్రాయేలీయుడైన ఒక బానిసకు మధ్య ఉండవలసిన సహవాసమును ఒకే కుటుంబమునకు చెందిన సభ్యుల వలే వారిని చూడడం ఉత్తమమైన విధానం అవుతుంది; వారు సహోదరులు. ఒక సహోదరుడు వృద్ధిపొందితే మరియు మరొక సహోదరుడు తననుతాను తన సహోదరునికి అమ్ముకొనునంతగా బీదవాడైపోతే, ధనికుడైన ఆ సహోదరుడు బీదవాడైన తన సహోదరుని ఎలా చూస్తాడు? తనకొరకు తన సహోదరుని పనిచేయనిస్తాడు, కాని కఠినమైన పనిని వానితో చేయించనివ్వడు. వాడు అతని పట్ల క్రూరముగా ఉండక దయతో ఉంటాడు. తన అవసరతల పట్ల ఆలోచన కలిగి ఉంటాడు; వానిని జాగ్రత్తగా పట్టించుకుంటాడు. తన సహోదరుని నుండి తీసుకొనవలసిన దానికంటే ఎక్కువ తన వద్ద నుండి ఆశించడు. పని చేస్తున్న ఆ సహోదరునికి అతడు సరిపడునంత ప్రయోజనాలను కూడా చేసిపెడతాడు. ఒక ఇశ్రాయేలీయుడైన యజమానుడు మరొక ఇశ్రాయేలీయుడైన బానిసను కూడా చూడవలసిన విధానము ఇదే.

ఇంకా, **దాసులను అమ్మినట్లు**గా యజమానుడు ఆ ఇశ్రాయేలీయుడైన బానిసను అమ్మకూడదు. అట్టి వేలములో అతనిని **అమ్మి**నట్లయితే వానిని ఎవరు కొంటారో అనేదానిలో నియంత్రణ ఉండదు (25:42). తనను కఠినముగా చూసే ఒకడు వానిని కొనవచ్చు, మరియు సునాద సంవత్సరములో సహితము వానిని విడిపించని వానిచే కూడా అతడు కొనబడవచ్చు.

**సునాద సంవత్సరములో** ఇశ్రాయేలీయుడైన బానిస విడిపింపబడాలి అనేది అత్యంత ప్రాముఖ్యమైన సత్యము (25:40).[11] అతడు మరియు **అతని పిల్లలు** తమ తమ సొంత ఇంటివారి యొద్దకు మరియు **వంశస్థుల** యొద్దకు **తిరిగి** వెళ్ళవలెను (25:41).[12]

దేవుని ఆజ్ఞలకు ఇశ్రాయేలీయుడైన బానిస యజమానుడు విధేయుడు అగునట్లు రెండు కారణములు ఇవ్వబడినవి: (1) అతని ఆధీనములో ఉన్న ఇశ్రాయేలీయుడైన బానిస అనువాడు వాస్తవముగానే దేవుని స్వాస్థ్యము. వాడు తనకు మాత్రమే దాసునిగా ఉండునట్లు దేవుడు **ఐగుప్తులో నుండి** [వానిని] **రప్పించాడు** (25:42). (2) ఆ బానిసను కలిగియున్న ఆ యజమానుడు **దేవుడైన** యెహోవాకు **భయపడాలి** - ఆయనను సన్మానించి, గౌరవించి మరియు ఆయనకు భయపడాలి (25:43). యెహోవాకు భయపడువాడు తన స్వాస్థ్యమును గౌరవముతో చూస్తాడు; అతడు యిచ్ఛపూర్వకముగా వాని పరువుతీయడం, అసహ్యించుకోవడం, లేదా దేవుడే తనంతట తానుగా విడిపించిన మరియు ఇంకను వాడికి యజమానునిగా ఉన్న ఒకనిని గాయపరచడు!

**వచనములు 44, 45.** ఇశ్రాయేలీయుడు కాని బానిస సంగతి ఏమిటి? ఈ వచనములలో, అట్టి **దాసులను** గూర్చిన రెండు ప్రశ్నలకు దేవుడు జవాబునిస్తున్నాడు. (1) ఈ బానిసలను ఇశ్రాయేలీయులు పొందవచ్చా? దీనికి సమాధానం "అవును." (2) వారిని వీరు ఎలా **కొనవచ్చును**? వారి **చుట్టుపట్లనున్న జనములలో నుండి** కొనవచ్చు లేదా వారి **మధ్య నివసించు పరదేశులను** వారు కొనవచ్చు. ఇశ్రాయేలీయులు వీరికి **పుట్టిన వారిని కొనవచ్చును** - అంటే, అట్టి పరదేశుల యొక్క సంతానమును కూడా వారు కొనవచ్చు. ఈ పిల్లలు ఇశ్రాయేలు దేశములోనే పుట్టినవారు, కాని అక్కడ నివశిస్తున్న పరదేశులకు **పుట్టిన** వారు (లేదా వారిచే కనబడిన వారు).

**వచనము 46.** తరువాత ఎదురయ్యే ప్రశ్న ఒక ఇశ్రాయేలీయుని స్వాధీనములో ఉన్న సదరు బానిసలు వారికి శాశ్వతముగా చెందుతారా లేదా సునాద సంవత్సరములో వారిని కూడా విడిపించేయాలా అనేది. దేవుని సమాధానం ఏమంటే ఇశ్రాయేలీయులు కాని **దాసులు** ఇశ్రాయేలీయులకు శాశ్వత స్వాస్థ్యముగా ఉన్నారు. ఇశ్రాయేలీయులు కాని దాసులు ఒకని పిల్లలతో సమానముగా **స్వతంత్రించుకొన** బడవచ్చును కూడా; వారు తమ ఇశ్రాయేలీయుడైన యజమానునికి శాశ్వత **స్వాస్థ్యము**గా ఉన్నారు. దీనికి విరుద్ధముగా, ఇశ్రాయేలీయుడైన దాసుడు కేవలము "సునాద సంవత్సరము వరకు" మాత్రమే యజమానుని సేవించాలి (25:40).

43వ వచనములోని పరిభాషను పునరావృతము చేస్తూ, ఇశ్రాయేలీయుడైన దాసుని పట్ల ఎలా వ్యవహరించాలో కూడా దేవుడు ఉద్ఘాటించాడు: అతని యజమానుడు అతనితో **కఠినసేవ చేయించుకొనకూడదు.** ఒక సహోదరుడు మరొక సహోదరుని బానిసగా పొందుకొనియున్నప్పటికీ కూడా అతనితో దురుసుగా ప్రవర్తించకూడదు.

## బీదవారిని విమోచించుట (25:47-55)

**47పరదేశియేగాని నీయొద్ద నివసించువాడేగాని ధనసంపాదనము చేసికొనునప్పుడు అతనియొద్ద నివసించు నీ సహోదరుడు బీదవాడై నీయొద్ద నివసించు ఆ పరదేశికైనను ఆ పరదేశి కుటుంబములో పేరొకనికైనను తన్ను అమ్ముకొనిన యెడల 48తన్ను అమ్ముకొనిన తరువాత వానికి విడుదల కావచ్చును. వాని సహోదరులలో ఒకడు వానిని విడిపింపవచ్చును. 49వాని పినతండ్రియేగాని పినతండ్రి కుమారుడేగాని వాని వంశములో వాని రక్తసంబంధియేగాని వాని విడిపింపవచ్చును. కావలసిన క్రయధనము వానికి దొరికిన యెడల తన్ను తాను విడిపించుకొనవచ్చును. 50అప్పుడు వాడు అమ్మబడిన సంవత్సరము మొదలుకొని సునాదసంవత్సరమువరకు తన్ను కొనినవానితో లెక్కచూచుకొనవలెను. వాని క్రయధనము ఆ సంవత్సరముల లెక్కచొప్పున ఉండవలెను. తాను జీతగాడైయుండిన దినముల కొలది ఆ క్రయధనమును తగ్గింపవలెను. 51ఇంక అనేక సంవత్సరములు మిగిలి యుండినయెడల వాటినిబట్టి తన్ను అమ్మిన సొమ్ములో తన విమోచన క్రయధనమును మరల ఇయ్యవలెను.; 52సునాద సంవత్సరమునకు కొన్ని**

**సంవత్సరములే తక్కువైన యెడల అతనితో లెక్క చూచుకొని సంవత్సరముల లెక్కచొప్పున తన విమోచనక్రయధనమును అతనికి చెల్లింపవలెను. [53]ఏటేటికి జీతగానివలె వాడతనియొద్ద ఉండవలెను. అతడు మీ కన్నులయెదుట వానిచేత కఠినముగా సేవ చేయించకూడదు. [54]అతడు ఈ రీతిగా విడిపింపబడనియెడల సునాదసంవత్సరమున వాడు తన పిల్లలతో కూడ విడుదలనొందును. [55]ఏలయనగా ఇశ్రాయేలీయులు నాకే దాసులు; నేను ఐగుప్తుదేశములో నుండి రప్పించిన నా దాసులే. నేను మీ దేవుడనైన యెహోవాను.**

ఈ శాసనాల యొక్క శ్రేణిలో చివరి చొరవ తననుతాను ఇశ్రాయేలీయుడు కానివానికి అమ్ముకొనిన పేద ఇశ్రాయేలీయుని గూర్చి వ్యవహరిస్తుంది.

**వచనములు 47-49. యెడల** అను కర్త కలిగిన వాక్యభాగముతో యెహోవా సమస్యను (దానికి ఆయన పరిష్కారాన్ని అందించే) వివరించాడు. ఒక **పరదేశి** (ఇశ్రాయేలీయుడు కానివాడు, అక్కడ నివసించు అన్యుడు) దేశములో దాసులను కొనుగోలు చేయగలిగినంత ధన సంపాదన కలిగియుంటే; ఒక ఇశ్రాయేలీయుడు తననుతాను పోషించుకోలేనంత **బీదవాడై** మరియు జీవించుటకు ఒక దాసునిగా తననుతాను అమ్ముకొనిన అవసరము వచ్చినప్పుడు; మరియు ఆ పరదేశి (లేదా అతని **సంతతిలో** ఒకడు) ఆ ఇశ్రాయేలీయుని కొనుగోలు చేసినప్పుడు, అప్పుడు ఏ నియమములు వర్తించబడును? ప్రాథమిక నియమం ఏమిటంటే దాసునిగా అమ్ముకొనబడిన ఇశ్రాయేలీయుడు **విడిపింపబడే హక్కును** కలిగియున్నాడు. ఆ దాసత్వములో నుండి అతడు బయట పడి మరియు మరలా తన స్వాతంత్ర్యమును పొందుకొనవచ్చును.

**అతనిని** దాసత్వము నుండి **విడిపించుటకు** లేదా తనను వెనుకకు కొనుగోలు చేయుటకు ఎవరు అర్హులు? ఇక్కడ రెండు అవకాశాలు ఇయ్యబడినాయి. (1) సమీప బంధువు - **తన సహోదరులలో ఒకడు, తన మామ, తన మామ కొడుకు** (పినతండ్రి కొడుకు), లేదా **తన రక్తసంబంధులలో** ఎవరైనా విడిపించే హక్కును కలిగియున్నాడు. (2) అతడు ఎంతైతే విలువ చేయబాడినాడో ఆ మొత్తం తనను కొనుగోలు చేసిన వారికి తిరిగి చెల్లించుట ద్వారా తనంతట తాను **విడిపించుకొన వచ్చును**. అలా చేయుటకు, తన దాసత్వపు సమయములో తనంతటతాను అభివృద్ధి పొందవలెను.[13]

**వచనములు 50-52.** ఎవరైనా (బంధువు లేదా ఆ ఇశ్రాయేలీయుడు కానీ) విడిపించే హక్కును ఉపయోగించినట్లైతే, **తననుతాను అమ్ముకొనిన** దాసుడైన ఇశ్రాయేలీయుని కొరకు ఆ పరదేశికి ఎంత చెల్లించవలెను? భూమిని విడిపించుటకు ఏ విధమైన నియమములు వర్తించబడినవో అవే నియమములు ఆ వ్యక్తిని **విడిపించుటకు** కూడా వర్తించబడును. అమ్మబడిన భూమి కొనుగోలు చేసిన వానికి శాశ్వతంగా చెందదు, అనగా దీర్ఘకాలిక లీజుకు అతనికి ఒప్పందం చేయబడుతుంది, అలాగే ఒక వ్యక్తి మరియొకనికి అమ్మబడిన యెడల వాడు అతనికి అద్దెకు మాత్రమే ఇయ్యబడతాడు. తన సేవలపై నిర్దిష్ట సమయ పరిమితిని కలిగియుండి, వాడు అతనితో కూడా **అమ్మబడిన** వానిగా నివసించుటకు వెళ్ళును. కొనుగోలు చేసినవానికి **సునాద సంవత్సరము** వరకు మాత్రమే అతడు దాసునిగా తన పనిని చేయగలడు. ఆ

సమయములో, అతడు విడిపింపబడును, మరియు అతడు తన కుటుంబములోకి తిరిగి వచ్చుటకు గల స్వాతంత్ర్యమును పొందును.

అదే సందర్భమైతే, అతని విముక్తి ధర ఎలా పరిగణించబడుతుంది? భూమివలె, తరువాత సునాద సంవత్సరము వరకు **ఎన్ని సంవత్సరాలు** ఉన్నాయో దాని ద్వారా ధర నిర్ణయించబడుతుంది. ఉదాహరణకు, యాభై సంవత్సరాల చక్రంలో అతడు ఇరవైయవ సంవత్సరములో తననుతాను $3,000కు అమ్ముకుంటే, మరియు అతడు ఆ చక్రంలో ముప్పైయవ సంవత్సరములో విడిపించబడితే, తన యొక్క విమోచనా క్రయధనము $2,000. విమోచనా క్రయధనము చెల్లించిన వ్యక్తి ఇశ్రాయేలు దాసుని యొక్క యజమానికి తాను అతనికొరకు ఎంత చెల్లించెనో అది తిరిగి చెల్లించును, ఈ పది సంవత్సరములలో వాడు ఆ యజమానునికి ఎంత సంపాదించి పెట్టెనో అది తీసివేయబడుతుంది.

**వచనము 53.** పరదేశీయుడు, ఇశ్రాయేలీయుని వలె, హెబ్రీ దాసునితో దయతో వ్యవహరించవలెను అనుదానిని గూర్చి లేఖనభాగము అదనపు సమాచారమును అందిస్తుంది. వాడు అతనిని దాసునివలె చూడకూడదు, కానీ **ఏటేటికి జీతగానివలె** చూడవలెను; **వానిచేత కఠినముగా సేవ చేయించకూడదు.** ఇశ్రాయేలు యొక్క దాసుని కొనుగోలు చేసిన పరదేశి లేదా అన్యునికి ఈ సందేశం సంబంధించి యున్నది అని జ్ఞాపకము చేసుకుంటూ, ఒకడు ఇలా ఆశ్చర్యపోవచ్చును, "ఈ సూత్రాలు అనుసరించుటకు ఒక పరదేసీయుడు - ఇశ్రాయేలు విశ్వాసమును పూర్తిగా హత్తుకొనని ఒకడు - ఎలాంటి ప్రోత్సాహాన్ని కలిగియుంటాడు?" వాస్తవమేమనగా ఈ పరదేశీయులు దేవుని యొక్క కృప ద్వారా మాత్రమే అక్కడ నివసించుటకు అనుమతినియ్యబడినారు, వారు ఇశ్రాయేలీయులతో మంచిగా వ్యవహరించాలని కోరబడినారు. బదులుగా, వారు ఇశ్రాయేలు యొక్క నియమాలను అనుసరించవలెను. వారు ఆ నియమాలను - ఉదాహరణకు, ఇశ్రాయేలు యొక్క దాసుని పట్ల ఉన్న నియమాలను అనుసరించుటకు తిరస్కరిస్తే - అనుసరించుటకు తిరస్కరిస్తే, వారు ఇశ్రాయేలులో జీవించె అవకాశమును కోల్పోతారు. కాబట్టి ఇశ్రాయేలు దాసుల విషయంలో దేవుని ఆజ్ఞకు లోబడుటకు వారికి సరైన కారణం ఉంది.

**వచనము 54.** ఇశ్రాయేలు దాసుడు మరియు ఇశ్రాయేలు కానివాడైన యజమానునికి సంబంధించిన చివరి అవకాశమేమనగా, తన యజమానునికి విమోచనా క్రయధనము చెల్లించుట ద్వారా ఎవరు కూడా - తనంతట తాను లేదా తన బంధువు - వాడిని విమోచింపలేరు. ఆ సందర్భములో, **సునాద సంవత్సరం** వచ్చినప్పుడు, ఇతర ఇశ్రాయేలు దాసుల వలె, అతడు విడిపించబడి కుటుంబములోకి తిరిగి చేర్చబడుటకు అనుమతించబడును. ఇశ్రాయేలీయులకు వర్తించబడినట్లే, విమోచన, విడుదల మరియు సునాద సంవత్సరమునకు సంబంధించిన నియమాలు పరదేశులకు (అన్యులకు లేదా అక్కడ నివసిస్తున్న అపరిచితులకు) వర్తించబడతాయి.

**వచనము 55.** ఆ సమయములో దాసత్వమునకు అమ్మబడిన వ్యక్తిని విడుదల చేయుటలో దేవుడు ఎందుకు ఆందోళన చెందుతున్నాడు అని ప్రజలకు జ్ఞాపకము

చేయుట ద్వారా సునాద సంవత్సరములోని విమోచనకు సంబంధించిన తన నియమాలను ఆయన ముగించెను: వారు ఆయన ప్రజలు! వారిని కొనుగోలు చేసిన వ్యక్తులకు వారు దాసులు లేదా పరిచారకులు కాదు; బదులు, వారు ఆయనకే **దాసులు** మరియు వారిని ఆయన **ఐగుప్తు** దేశము యొక్క బానిసత్వమునుండి విడిపించెను.

## 25వ అధ్యాయములోని ఈ ప్రత్యేక సంవత్సరములను ఇశ్రాయేలీయులు ఆచరించుట

విశ్రాంతి సంవత్సరము మరియు సునాదము సంవత్సరము రెండూ ఆకర్షనీయమైన అంశాలను కలిగి ఉన్నాయి. అవి ఉత్పాదక, సంపన్న, దయగల మరియు దేవుని భయముగల సమాజమును నిర్మించుటకు సహాయపడి ఉండేవి. అయితే, వాస్తవంగా యూదులు వాటిని పాటించారా, లేదా ఈ నియమాలు తొందరలోనే మరచిపోయారా? దేవుడు ఆజ్ఞాపించినవి "అన్నీ" చేయాలనే వాస్తవమైన ప్రతిజ్ఞ ఉన్నప్పటికినీ (నిర్గమ. 19:8), ఇశ్రాయేలీయులు తరచుగా మరచిపోయెడివారు, నిర్లక్ష్యం చేసేవారు లేదా స్పష్టంగా దేవుని యొక్క నియమాలకు అవిధేయత చూపెడివారు.

ఈ పరిశుద్ధ సంవత్సరములు పాతన నిబంధన యొక్క ఇతర భాగములలో ప్రముఖ పాత్ర పోషించనప్పటికినీ, యూదులు వాటిని ఆచరించినట్లు కొన్ని ఆధారాలు ఉన్నాయి. Lawrence H. Schiffman వ్రాసాడు,

> రెండవ మందిరపు కాలములో విశ్రాంతి సంవత్సరము యొక్క ఆచారమును గూర్చి (ఐదవ శతాబ్దము చివర క్రీ.పూ.-క్రీ.శ. 70) [నెహెమ్యా 10:31] మరియు [1 మక్కాబీస్ 6:49, 53] సాక్ష్యమిస్తున్నాయి, మరియు Julius Caesar విశ్రాంతి సంవత్సరములో పన్నుల నుండి యూదులను మినహాయించినట్లు నిర్ధారించాడు (Josephus *Antiquities* 14.202).[14]

నెహెమ్యా గ్రంథములో ప్రస్తావన కాకుండా, విశ్రాంతి సంవత్సరము లేదా సునాద సంవత్సరమును గూర్చి ఇతర పంచగ్రంథము యొక్క ఇతర పుస్తకాలలో ప్రత్యేకముగా పేర్కొనబడలేదు; కానీ, R. K. Harrison సూచించినట్లు, కొన్ని లేదా చాలా యూదుల పండగలు మోషే యొక్క ధర్మశాస్త్రము మీద ఆధారపడినవే. ఈ దృగ్విషయమునకు "అత్యంత సంబావ్య వివరణ" ఏమిటంటే "ఈ సందర్భాలు సహజంగా జాతీయ జీవితంలో భాగంగా తప్పక అంగీకరించబడేవి, అందువలన ప్రత్యేకముగా దీనికొరకు ప్రత్యేక ప్రస్తావన లేదు."[15]

అయితే, ఈ సంవత్సరములను గూర్చి దేవుడు ఇశ్రాయేలీయులకు మోషే ద్వారా నియమాలను ఇచ్చిన తరువాత, ప్రజలు వాటిని ఆచరించారు, అయినా పంచగ్రంథములో ఇతర నియమాల మాదిరిగానే, వారు కొన్నిసార్లు వాటిని ఆచరించుట నిర్లక్ష్యంచేసారు లేదా దేవుడు ఆజ్ఞాపించినట్లుగా వాటిని ఆచరించుటలో విఫలమయ్యారు అని మనము ముగించవచ్చు. ఇవ్వబడిన దేవుని యొక్క

నియమాలు ఎల్లప్పుడూ సరైన విధంగా అనుసరింపబడలేదు అని బైబిలు వ్యాఖ్యాతలు జ్ఞాపకము చేసుకొనవలెను.

## అన్వయము

### మోషే నియమము మరియు ఆర్థిక సమానత్వము (25:8-55)

నిస్సందేహముగా, ప్రతి యాభై సంవత్సరాలకు భూమిని దాని యొక్క అసలైన యజమానులకు తిరిగి ఇచ్చేందుకు ఉన్న అవసరమైన నియమం అనునది ఇశ్రాయేలులో సామజిక ఆర్థిక సమానత్వాన్ని ప్రోత్సహించియుంటుంది. ఆర్థికంగా సమానముగా ఉన్న సమాజాన్ని కలిగియుండాలని దేవుడు ప్రతి ఒక్కరిని ఆజ్ఞాపించినట్లు ఒకడు ముగించాలా?

"కాదు" అనునది జవాబు. దొంగతనమును నిషేదించుట ద్వారా, చట్టం అనునది ఆస్తి యొక్క వ్యక్తిగతమైన యాజమాన్యాన్ని రక్షించినది. కొంతమందికి జీవించుటకు వసతులు అందించుట ద్వారా కొందరు పేదలుగా ఉంటారని అది గుర్తించినది. తరువాత, గోత్రములు తమ భూములను పొందుకొనినప్పుడు ఇశ్రాయేలీయులు సమానముగా లేరు. ఖచ్చితముగా అందరూ ఒకే విధమైన మొత్తములో భూమిని పొందుకొనినప్పటికీ (సందేహముగా ఉన్నది), వారి మార్గాలు భిన్నంగా ఉన్నాయి. కొన్ని పొలాలు ఇతరుల కన్నా ఎక్కువగా సారమును కలిగియున్నవి, మరియు కొందరు రైతులు తప్పకుండా ఇతరులకన్నా విజయవంతులయ్యారు. సునాద సంవత్సరమునకు ముందు మరియు తరువాత, ఖచ్చితముగా సమాజములు కొందరు ధనవంతులు మరియు కొందరు పేదవారు ఉన్నారని చట్టం ఊహించినది.

సునాద సంవత్సరపు నియమాలు సమాజాన్ని మరింత సమానంగా ఉంచినది కానీ, పూర్తిగా కాదు. నియమం యొక్క ఆందోళన అనునది అందరిని సమానముగా చేయుట కాదు కానీ, అందరూ జీవించుటకు వసతులను కల్పించుటయే. ధనవంతులు పేదల పట్ల దయ మరియు ఉదారత్వమును కలిగియుంటేనే ఈ లక్ష్యం సాధించబడుతుంది.

### "విడుదలను చాటించుట!" (25:10)

మోషే ఇశ్రాయేలీయులకు చెప్పవలసినదిగా దేవుడు ఇలా సూచించెను,

> మీరు ఆ సంవత్సరమును, అనగా ఏబదియవ సంవత్స రమును పరిశుద్ధపరచి మీ దేశవాసులకందరికి విడుదల కలిగినదని చాటింపవలెను; అది మీకు సునాదముగా నుండును; అప్పుడు మీలో ప్రతివాడు తన స్వాస్థ్యమును తిరిగి పొందవలెను; ప్రతివాడు తన కుటుంబమునకు తిరిగి రావలెను (25:10; NRSV).

సునాద సంవత్సరమును గూర్చిన ప్రాథమిక వాస్తవాలను ఈ వచనము ప్రదర్శిస్తుంది. అది ఏబదియవ సంవత్సరము జరుగుతుంది; అది యెహోవాకు "పరిశుద్ధపరచవలెను" లేదా ప్రతిష్ఠించవలెను; మరియు అది "విడుదలను"

(“విమోచన”; NASB) ప్రకటించే సమయము. భూమి దాని అసలైన యజమానులకు తిరిగి ఇయ్యబడుతుంది కాబట్టి, ఆ విడుదల భూమి కొరకు ఉన్నది. అది ప్రజల కొరకు ఉన్న విడుదల కూడా ఎందుకనగా దాసులు విడిపించబడి వారి కుటుంబాలకు తిరిగి వెళ్ళుటకు అనుమతించబడినారు.

“విడుదల చాటించు!” ఆ ఆలోచన మనకు విజ్ఞప్తి చేస్తుంది. అందరూ స్వేచ్ఛా ఆనందాన్ని కోరుకుంటారు; మనందరం స్వతంత్రముగా ఉండాలని అనుకుంటాము!

స్వేచ్ఛ కొరకైన అంతర్లీన మానవ కోరిక యొక్క ఉదాహరణగా, ఉత్తర అమెరికా ఖండంలో దాదాపు 250 ఏళ్ల క్రితం జరిగిన సంఘటనను పరిగణించండి. ఇంగ్లాండ్ యొక్క కాలనీలలో నివసించుచున్న ప్రజలు స్వతంత్రం పొందాలని నిర్ణయించుకున్నారు. వారి యొక్క ఎడతెగని కోరిక Patrick Henry ద్వారా వ్యక్తపరచబడినది, అతడు తన ప్రసంగములో ఇలా చెప్పారు, “నాకు విడుదలనైనా ఇవ్వండి, లేదా నాకు మరణమునైనా ఇవ్వండి!” వలసవాదుల అశాంతి ఫలితముగా, జులై 4, 1776, ఇంగ్లాండ్ యొక్క పదమూడు కాలనీల ప్రతినిధులు స్వాతంత్ర్య ప్రకటనపై సంతకం చేశారు, గ్రేట్ బ్రిటన్ నుండి వారి స్వేచ్ఛను ప్రకటించారు. ఇది అనేక సంవత్సరాలు రక్తపాతమునకు దారితీసింది, కానీ చివరికి యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా స్వతంత్ర దేశం కొరకు పోరాడిన స్వతంత్ర యుద్ధం నుండి ఉద్భవించినది! ఆ సమయములో ప్రకటించువారు లేవీయకాండము 25:10లో ఉన్న పదాలను చాటించియుండవచ్చు: “దేశమంతా దాని నివాసులకు విడుదలను ప్రకటించుడి!” (NRSV). అప్పటి నుండి, అమెరికా వారు వారి విడుదలను - వారి స్వాతంత్ర్యమును, వారి విమోచనను జులై నాలుగున జరుపుకున్నారు.

*విడుదలను చాటించు: యేసు క్రీస్తు ద్వారా.* స్వాతంత్ర్యం ప్రకటించిన మరో చారిత్రాత్మక సందర్భం రెండువేల సంవత్సరాల క్రితం జరిగినది. బెత్లెహేము పట్టణ సమీపములో దేవదూత గొర్రెలకాపరులకు ప్రత్యక్షమై ఇలా చెప్పెను, “అయితే ఆ దూతభయ పడకుడి; ఇదిగో ప్రజలందరికిని కలుగబోవు మహా సంతోషకరమైన సువర్తమానము నేను మీకు తెలియజేయు చున్నాను; దావీదు పట్టణమందు నేడు రక్షకుడు మీ కొరకు పుట్టి యున్నాడు, ఈయన ప్రభువైన క్రీస్తు.” అప్పుడు దూతలు ఇలా పాడారు, “సర్వోన్నత మైన స్థలములలో దేవునికి మహిమయు ఆయన కిష్టులైన మనుష్యులకు భూమిమీద సమాధానమును కలుగునుగాక అని దేవుని స్తోత్రము చేయుచుండెను” (లూకా 2:10, 11, 14).

యేసు ప్రజల స్వేచ్ఛను స్థాపించడానికి భూమికి వచ్చినందున యేసు యొక్క జననం స్వేచ్ఛ ప్రకటన కోసం ఒక సమయమును సూచించింది! నజరేతు సమాజమందిరములో, ఆయన తన పరిచర్య ప్రారంభించిన వెంటనే, ఆయన యెషయా నుండి ఈ వాక్యభాగమును చదివెను: “ప్రభువు ఆత్మ నామీద ఉన్నది బీదలకు సువార్త ప్రకటించుటకై ఆయన నన్ను అభిషేకించెను చెరలోనున్న వారికి విడుదలను, గ్రుడ్డివారికి చూపును, (కలుగునని) ప్రకటించుటకును నలిగినవారిని విడిపించుటకును . . .” ఆ తరువాత ఆయన ఇలా చేర్చెను, “ఆయన నేడు మీ వినికిడిలో ఈ లేఖనము నెరవేరినదని వారితో చెప్పసాగెను” (లూకా 4:18, 21; యెషయా 61:1, 2 చూడండి). మరియొక విధంగా చెప్పాలంటే, వారికి స్వాతంత్ర్యం కల్పించేందుకు రానున్న మెస్సీయ

కొరకు యూదులు వేచియున్నారు; మరియు యేసు ఇలా చెప్పెను, "మీకు విడుదల ప్రకటించుటకు వచ్చినవాడను నేనే!"

"మీరు సత్యమును గ్రహించెదరు, అప్పుడు సత్యము మిమ్మును స్వతంత్రులనుగా చేయునని చెప్పెను" (యోహాను 4:32), అని ఆయన తరువాత చెప్పుట ద్వారా ఆ మాటను మరింత స్పష్టము చేసెను. యేసే "సత్యమని" ప్రకటించబడెను (యోహాను 14:6). స్వతంత్రుడగుటకు, ఒకడు యేసు వైపు తిరిగి ఆయన చెప్పిన మాటలను విని వాటికి విధేయత చూపాలి. ఒకడు యేసు యొక్క సత్యము విని దానిని అనుసరించినప్పుడు, ఆ సత్యము అతనిని స్వతంత్రునిగా చేస్తుంది!

*విడుదలను ప్రకటించు: పాపము నుండి.* యోహాను 8:32లో ఉన్న వాక్యము ఈ ప్రశ్నకు దారితీస్తుంది, "దేనినుండి విడుదల?" యేసు ఏమి చెప్పుచున్నాడో యూదులకు అర్థంకాలేదు. వారు రోమా పరిపాలన నుండి విడిపించబడాలని కోరుకున్నారు, కానీ భూసంబంధమైన యజమానుల నుండి వచ్చే విడుదలను గూర్చి కాదు యేసు మాట్లాడేది. క్రొత్తనిబంధన కాలాలలో, దాసులు క్రైస్తవులుగా మారినప్పుడు, వారు దాసులుగానే మిగిలిపోయేవారు (గలతీ. 3:26-28) కానీ ఆత్మీయంగా విడుదల పొందేవారు. స్వతంత్రుడు కానీ దాసుడు కానీ, పాపము చేసియున్నారు మరియు వారు పాపానికి దాసులైయున్నారు అను విషయము యూదులకు అర్థంకాలేదు - మరియు నేడు చాలా మంది ప్రజలు అర్థం చేసుకోలేకపోతున్నారు. దీనిని యేసు ఇలా చెప్పారు: "పాపము చేయు ప్రతివాడును పాపమునకు దాసుడు" (యోహాను 8:34). పాపము అనే దాసత్వము నుండి యేసు మనలను విడిపించెను.

అదే శుభవార్త! పాపము అనే అపరాధము లేకుండా మనం జన్మించాము. ఒక సందర్భములో, దేవుడు చేయవద్దని చెప్పిన వాటిని చేస్తూ ఆయన ఆజ్ఞలకు విధేయత చూపకపోవుటతో మనం పాపం చేయుట ప్రారంభించాము. ఆ సందర్భములో, యేసు చెప్పినట్లు, మనం "పాపమునకు బానిసలము" అయితిమి. మరో మాటలో చెప్పాలంటే, మనం దయ్యానికి దాసులమైతిమి. మనం స్వతంత్రులమని అనుకోవచ్చు; నైతిక నియమాల ఇరుకైన పరిమితుల నుండి మరియు భారమైన బాధ్యతలు మతపరమైన బాధ్యతల నుండి విముక్తి పొందినట్లు మనం అనుకోవచ్చు, కానీ మనం మన సొంత కామానికి, పాపానికి, దయ్యానికి దాసులమైయున్నాము.

పాపము ఒక బానిసత్వము కాదు అని నమ్మువారిని మద్యపానాన్ని విడిచిపెట్టుట లేదా మాదకద్రవ్యాలను ఉపయోగించుట మానుకోవడం అంటే ఎంత కష్టమో అడగమని వాటికి బానిసయైనవాడిని అడగమని చెప్పండి. అలాంటి బానిసత్వాలను విడిచిపెట్టుట అనునది చాలా కష్టమైనది. బానిసత్వాలు అనునవి బానిసను బంధించే సంకెళ్ళ వంటివి, మరియు అతడు ఆ సంకెళ్ళ నుండి విడిపింపబడుటకు కష్టముగా ఉంటుంది. పాపము అలాంటిదే. అది మనలను బానిసలుగా చేసుకుంటుంది. మనం ఒక్కసారి పాపం చేసినప్పుడు, మరలా దానిని చేయుటకు పూనుకుంటాము, త్వరలోనే ఆ పాపం అలవాటుగా మారిపోతుంది. చివరకు అది బానిసత్వముగా మారుతుంది. శపించుటకు, లైంగిక అనైతికతకు,

అధికంగా తినుటకు, అహంకారమునకు ప్రేమించుటకు బదులు ద్వేషంగా నటించుటకు ఒకడు బానిసైపోవును. అలాంటి వ్యసనమును ఒకడు అనుభవిస్తున్నప్పుడు, వాడు పాపమునకు బానిస అగును.

మనం పాపం చేసినప్పుడు - మనం గుర్తించినా గుర్తించకపోయినా మనం పాపానికి దాసులమే. పాపము మనకు యజమాని, కానీ అది దాని సేవకుల పట్ల ఉదారతను కలిగియుంటుంది. ఇది పాపి యొక్క వేతనాలను ఎప్పుడు అడ్డుకోదు. పాపము ఎలాంటి వేతనాలను చెల్లిస్తుంది? పౌలు మనకు ఈ విధంగా చెప్పెను: "పాపము యొక్క జీతం మరణం" (రోమా. 6:23; 6:21 చూడండి). పాపము అనునది తన దాసులైన పాపులను దేవుని నుండి వేరు చేసి పరలోక ఆశీర్వాదాలను ఎన్నటికి పొందకుండా ఆత్మీయంగా శాశ్వత మరణమును ఇస్తుంది!

ఇందుమూలమున యేసు యొక్క రాకడ అనునది అద్భుతమైన శుభవార్త. అది కేవలం భూమిపైకి ఉన్నతమైన నైతిక నియమాన్ని తీసుకువచ్చినదని కాదు. మన తోటి మనిషికి ఎలాంటి ప్రేమను ఆయన ప్రదర్శించెను అనునది కాదు. ఆయన రాబోవుచున్న తరములన్నిటికి సొంత త్యాగం యొక్క మాదిరిని విడిచిపెట్టి హతసాక్షిగా చనిపోయెను అనునది కాదు. ఆయన అద్భుతమైన పాఠాలు చెప్పెను లేదా పేదల పట్ల కరుణ కొరకైన అవసరాన్ని నొక్కి చెప్పుట మరియు పాపులను ప్రేమించే ప్రాముఖ్యతను చెప్పుట మాత్రం కాదు. యేసు యొక్క రాకడలో మనం సంతోషించవలసిన మొదటి కారణం ఏమనగా పాపమూ యొక్క బానిసత్వము నుండి ఆయన విడుదలను ప్రకటించెను. ఆయన మరియు ఆయన యొక్క మరణము మూలముగా, ఎవరూ వారి పాపం యొక్క శాశ్వతమైన శిక్షను అనుభవించాల్సిన అవసరం లేదు.

*విడుదలను ప్రకటించుట: విధేయత ద్వారా.* (1) పాపమునకు బానిసయైయున్నాడని, పాపములో మరణించెనని, శాశ్వతమైన మరణములోకి త్రోసివేయబడినాడని మరియు (2) పాపము యొక్క బంధకములో నుండి విడిపించుటకు యేసు వచ్చెనని ఒక వ్యక్తి అర్థం చేసుకున్నప్పుడు, పెంతెకొస్తు దినమందు వారు ఏడ్చినట్లు, వాడు ఏడ్చును, "నేనేమి చేయవలెను?" అపొ. 2:38లో పేతురు యొక్క స్పందన సమోదుచేయబడినది: "మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరము పొందుదురు."

రోమాలో ఉన్న తన పాఠకులకు వారు పాపము నుండి విడిపించబడినారని వారు ఇకపై దానిలో జీవించనక్కరలేదని పౌలు జ్ఞాపకము చేసెను. నేడు అంతర్లీనంగా క్రైస్తవులకు అది ఒక ముఖ్యమైన పాఠం. ఒకడు క్రైస్తవునిగా మారినప్పుడు ఒక గొప్ప మార్పు తనలో సంభవిస్తుంది. మరణము నుండి జీవముకు, పాపమూ యొక్క బానిస నుండి నీతి యొక్క బానిసకు మార్పు సంభవిస్తుంది.

ఆ మార్పును ఏది తీసుకువస్తుంది? రోమీయులకు 6:16-18లో పౌలు ఒక ప్రేరేపితమైన జవాబును ఆ ప్రశ్నకు ఇచ్చెను:

> లోబడుటకు దేనికి మిమ్మును మీరు దాసులుగా అప్పగించుకొందురో, అది చావు

నిమిత్తముగా పాపమునకే గాని, నీతి నిమిత్తముగా విధేయతకే గాని దేనికి మీరు లోబడుదురో దానికే దాసులగుదురని మీరెరుగరా? మీరు పాపమునకు దాసులై యుంటిరిగాని యే ఉపదేశక్రమమునకు మీరు అప్పగింపబడితిరో, దానికి హృదయపూర్వకముగా లోబడినవారై, పాపమునుండి విమోచింపబడి నీతికి దాసులైతిరి; ఇందుకు దేవునికి స్తోత్రము.

ఈ రోమీయులను పాపము యొక్క దాసత్వము నుండి నీతి యొక్క దాసత్వములోకి ఈ గొప్ప మార్పు ఎప్పుడు మరియు ఎలా మార్చింది? వారు పొందిన సిద్ధాంతమును లేదా "ఉపదేశ క్రమమును" "హృదయములోనుండి అనుసరించినప్పుడు" అది సంభవించినది. దేవుడు పరలోకములో నుండి చూచుచు వారిపైకి విడుదలను ప్రకటించినప్పుడు వారు ఆ సువార్తకు విధేయత చూపినప్పుడు సంభవించినది: "పాపమునకు బానిసయైయున్న ఈ వ్యక్తి, పాపము నుండి ఇప్పుడు విడిపించబడెను. నా బిడ్డా ఇప్పుడు ఎలా ఉంది!"

*విడుదలను ప్రకటించుట: ఒకడు బాప్తిస్మము పొందినప్పుడు.* క్రీస్తు రక్తము ద్వారా దేవుడు ఒకనిని కృప ద్వారా రక్షించిన కార్యము జరిగినటువంటి ఒక నిర్దిష్ట సమయం ఉందా? అవును, అపొస్తలులచే అందించబడిన "ఉపదేశ క్రమమునకు" విధేయత చూపుట అను విషయమే - కానీ దాని అర్థమేమిటి?

రోమీయులకు 6 ప్రారంభములో, బాప్తిస్మము అనునది ఒక వ్యక్తిని పాపము నుండి కడిగి మరలా జీవింపచేస్తుందని పౌలు చెప్పెను. "క్రీస్తు యేసులోనికి బాప్తిస్మము పొందితిమి" మరియు "మరణములోనికి బాప్తిస్మము పొందితిమి," అని అతడు చెప్పెను (రోమా 6:3); మరియు బాప్తిస్మములో "క్రీస్తుతో పాతిపెట్టబడితిమి" మరియు "నూతనజీవములో నడుచుకొనుటకు" లేపబడితిమి (రోమా. 6:4); మనము బాప్తిస్మము పొందినప్పుడు "మన పాపశరీరము నిరర్థకమైపోయెను" మరియు మనము "ఇకపై . . . పాపమునకు దాసులము కాము" (రోమా. 6:6; 6:7 చూడండి). అందువలన, ఎవరైనా యేసుక్రీస్తులో విశ్వాసముంచినప్పుడు, తన పాపము నిమిత్తము ప్రాయశ్చిత్తము పొందినప్పుడు, మనుష్యులందరి ముందు తన విశ్వాసమును ఒప్పుకొనినప్పుడు, క్రిస్తులో బాప్తిస్మము పొందినప్పుడు, మార్పు సంభవిస్తుంది. ఆ సందర్భములో, దేవుని కృప ద్వారా, క్రీస్తు రక్తములోని శక్తి ద్వారా, అతను క్రీస్తులో స్వేచ్ఛ కొరకు పాపమునకు తన బానిసత్వమును వర్తకం చేస్తాడు.

బాప్తిస్మము యొక్క నీటిలో నుండి ఒకడు పైకి వచ్చినప్పుడు, "విడుదలను ప్రకటించు! ఈ వ్యక్తి ఇకపై పాపముకు లేదా సాతానుకు దాసుడు కాదు! అతడు పాపము నుండి విడిపించబడినాడు; అతడు దేవుని బిడ్డ మరియు నీతికి దాసుడు!" అని చెప్పుట సరియైన విషయం.

*విడుదలను ప్రకటించుట: ఇప్పుడే!* క్రైస్తవులు పంచుకొనుటకు శుభవార్త కలదు: క్రీస్తు వచ్చినందున విడుదల లేదా స్వతంత్రం అనునది సాధ్యం. ఆయన ప్రతి ఒక్కరికి రక్షణను, లేదా పాపము నుండి స్వాతంత్ర్యమును అనుగ్రహించును!

సునాద సంవత్సరం ప్రారంభములో విడుదల ప్రకటించుట కన్నా మన శుభవార్త ఉత్తమమైనది. ఆ ప్రజలు వారి యొక్క విడుదలను పొందుటకు యాభైయవ

సంవత్సరం కొరకు వేచియుండవలెను. మన విడుదల ఇప్పుడు మరియు ఎప్పుడు అందుబాటులో ఉన్నది. పాపము నుండి విడిపించబడుటకు ఎవరు సునాద సంవత్సరము వరకు వేచియుండనవసరంలేదు. సువార్త పిలుపుకు విధేయత చూపుటకు ఇష్టపడిన ఎవరైనా ఇప్పుడే విడుదలను పొందవచ్చు.

## దాసత్వం గురించి ఏమిటి? (25:39-46)

దేవుడు ఆయన యొక్క ప్రజల మధ్యలో దాసత్వమును ఎలా సహించాడని నేడు చాలామంది పాఠకులు ఆశ్చర్యపోతున్నారు. దాసత్వం యొక్క భావన మనలను బాధపెట్టినందున, ఇశ్రాయేలు దానిని అనుసరించుటకు దేవుడు ఎందుకు అనుమతించేనో అని మనం ఆశ్చర్యపోతాము. మోషే ధర్మశాస్త్రం దాసత్వం యొక్క ప్రభావాలను తగ్గించే శాసనాలను కలిగియుంది, కానీ దానిని నిషేదించినట్లు ఏ శాసనము లేదు. ఆ వాస్తవము నుండి ఒకడు ఏ ముగింపులోకి రావలెను? దాసత్వమును గూర్చి మనం అర్థం చేసుకొనుటకు సహాయం చేసే మూడు ముఖ్య ఆలోచనలను Roy Gane అందించారు.

మొదటిగా, దేవుడు దాసత్వం యొక్క ఆచరణను స్థాపించలేదు. బహుభార్యత్వం మరియు విడాకులు వంటి వాటివలె, దాసత్వం అనునది పడిపోయిన మానవత్వంతో ఉద్భవించినది. ధర్మశాస్త్రంలో, వాటి దుష్ప్రభావాలను తగ్గించడానికి దేవుడు అలాంటి విధానాలను నియంత్రించాడు (నిర్గమ. 21:7-11; లేవీ. 18:18; ద్వితీ. 21:15-17; 24:1-4). యిర్మీయా ప్రవక్త ద్వారా, న్యాయబద్ధంగా వారిని విడుదల చేసిన తర్వాత బానిసలను తిరిగి తీసుకున్న యెరూషలేములోని యూదులను యెహోవా నిరాకరించాడు (యిర్మీ. 34:12-22).

రెండవదిగా, దేవుడు తరచూ ఆయన సత్యాన్ని క్రమక్రమంగా వెల్లడించాడు. ఉదాహరణకు, ఇద్దరు సొదరీమణులతో ఉన్న యాకోబు యొక్క వివాహాలను ఆయన సహించసాగాడు (ఆది. 29) కానీ తరువాత ఆ ఆచారమును నిషేధించాడు (లేవీ. 18:18). దాసులను గూర్చి మానవుల వ్యవహారమును గూర్చిన శాసనాలలో పురోగతి కూడా ధర్మశాస్త్రంలో స్పష్టంగా ఉంది. నిర్గమకాండము 21లో కనిపించే నియమాలను మించి, స్త్రీ దాసి యొక్క విడుదలను గూర్చి ద్వితీయోపదేశకాండము చెప్తుంది (ద్వితీ. 15:12) మరియు బానిసను విడిపించుటకు గల ఈ దయగల ఆజ్ఞను కలిగియుంది: “నీవు ఐగుప్తుదేశములో దాసుడవై యున్నప్పుడు నీ దేవుడైన యెహోవా నిన్ను విమోచించెనని జ్ఞాపకము చేసికొని, నీ మందలోను నీ కళ్లములోను నీ ద్రాక్ష గానుగలోను కొంత అవశ్యముగా వాని కియ్యవలెను. నీ దేవుడైన యెహోవా నిన్ను ఆశీర్వ దించి నీ కనుగ్రహించిన దానిలో కొంత వానికియ్యవలెను” (ద్వితీ. 15:14).

మూడవదిగా, ఇశ్రాయేలు గిరిజన తెగ వ్యవసాయం మీద ఆధారపడిన కారణముగా, ప్రజలను సజీవంగా ఉంచుటకు దేవుడు రుణ దాసత్వమును అనుమతించాడు. బాధ సమయంలో వారు బంధువుల సహాయం పొందలేకపోతే, మరణం అలమట నుండి వారిని నిరోధించుటకు రుణ దాసత్వం మార్గమవుతుంది. ఇది రెండు దుష్టుల కన్నా తక్కువ.[16]

దాసత్వం ఇప్పటికీ మొదటి శతాబ్దపు ప్రపంచంలో వాస్తవికతగా ఉన్నది. క్రొత్తనిబంధనలో ఈ ఆచారం నిషేధించబడనప్పటికీ, ఇది ఖచ్చితంగా నియంత్రించబడినది. "న్యాయముగా మరియు ధర్మముగా" (కొలస్సీ. 4:1) వారితో వ్యవహరించవలెనని మరియు "వారిని బెదిరించుట మానవలెను" (ఎఫెసీ. 6:9) అని క్రైస్తవ యజమానులు ఉపదేశించబడినారు. ప్రత్యేకముగా, క్రొత్త క్రైస్తవుడైన, ఒనేసిము "అతడిక మీదట దాసుడుగా ఉండక దాసునికంటె ఎక్కువవాడుగాను, ప్రియ సహోదరుడుగా" (ఫిలే. 16) వ్యవహరించవలెనని ఫిలేమోను సూచింపబడినాడు. ఈ దృక్పథం ఇటీవలి శతాబ్దాల్లో దాసత్వాన్ని నిర్మూలించుటకు దారితీసింది.[17]

---

సూచనలు

[1]Coy D. Roper, *Exodus*, Truth for Today Commentary (Searcy, Ark.: Resource Publications, 2008), 385లోని నిర్గమకాండము 23:10, 11 పైనున్న చర్చను చూడండి. [2]"దానంతట అదే పండు" అనుదానికి హెబ్రీ పదము (סָפִיחַ, *సపియాచ్*) అనగా "పుల్ల గింజలలో నుండి ఉన్న పెరుగుదల." "దాని యొక్క సొంత ఒప్పందం ప్రకారం పెరుగుతుంది," అని అనువదిస్తుంది, మరియు "దానంతట అదే పెరుగుతుంది," అని ESV అనువదిస్తుంది. [3]ఈ ప్రకరణము ఒక రైతు యొక్క క్రమానుగత పంటకు (కార్మికులను ఉపయోగించి, సమర్థవంతంగా పనిచేయించుట, మరియు ఫలితాలను జాగ్రత్తగా తూయించి ప్యాక్ చేయించుట) మరియు యాదృచ్ఛికంగా ఫలవంతం కాని పొలములు మరియు తోటలునుండి పండు మరియు ధాన్యమును ఎంపిక చేయు వ్యక్తుల చర్యలకు మధ్య వ్యత్యాసాన్ని చేస్తుంది. ఒక రైతు తన పంటలను పండించుటకు మరియు వాటిని విక్రయించుటకు ఈ నియమం నిషేధిస్తుంది అనునది ప్రధాన వ్యత్యాసం కావచ్చు. [4]Lawrence H. Schiffman, "Jubilee," in *Harper's Bible Dictionary*, ed. Paul J. Achtemeier (San Francisco: Harper & Row, 1985), 511. [5]Gordon J. Wenham, *The Book of Leviticus*, The New International Commentary on the Old Testament (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1979), 319. [6]Adapted from Roy Gane, *Leviticus, Numbers*, The NIV Application Commentary (Grand Rapids, Mich.: Zondervan, 2004), 434-35; Jacob Milgrom, "The Book of Leviticus," in *The Interpreter's One-Volume Commentary on the Bible*, ed. Charles M. Laymon (Nashville: Abingdon Press, 1971), 83. [7]ఎఫ్రాయిము, మనష్షే తెగలకు యోసేపు విభజన ద్వారా "పన్నెండు" అను సంఖ్య లెక్కించబడుతుంది. Coy D. Roper, *Numbers*, Truth for Today Commentary (Searcy, Ark.: Resource Publications, 2012), 29లో ఉన్న చర్చను చూడండి. [8]మరలా, "పరవాసి" (*'ach*, అక్షరాలా, "సహోదరుడు") అను పదము ఉపయోగించబడినది. దేవుని యొక్క కుటుంబములో ఇశ్రాయేలీయులందరూ "సహోదరులే." [9]"వడ్డీ వసూలు చేయు" అను పదము అదే మూలపదమైన "వడ్డీ" అనుదాని నుండి వచ్చినది, అది అధిక లేదా అక్రమంగా దోచుకొనిన అధిక వడ్డీని సూచిస్తుంది. [10]హెబ్రీ లేఖనభాగము యొక్క అక్షరాలా అనువాదమేమనగా "వడ్డీని తీసుకొనవద్దు లేదా తన నుండి పెరుగుదలను ఆశించవద్దు" (NIV చూడండి). ఒక ఇశ్రాయేలీయుడు పరవాసికి అప్పు ఇచ్చిన యెడల ఆ బీద పరవాసి దగ్గర నుండి వడ్డీ తీసుకొననకూడదు. ఒక పేద ఇశ్రాయేలీయుని యొక్క రుణగ్రహీత "అతనిని పట్టుకొని" తన కొరకు పని చేయించుకొనవచ్చును, కానీ అతడు తనకు తానుగా ఎలాంటి అదనపు వడ్డీని వసూలు చేయకూడదు అని ఆ వాక్యభాగము చెప్పుచున్నదని నమ్ముతూ దానిని R. Laird Harris వ్యత్యాసంతో చూచెను. (R. Laird Harris, "Leviticus," in *The Expositor's Bible Commentary*, vol. 2, *Genesis-Numbers*,

ed. Frank E. Gaebelein [Grand Rapids, Mich.: Zondervan Publishing House, 1990], 639.)

[11]హెబ్రీ దాసుడు "సునాద సంవత్సరము" వరకు వేచియుండుట కన్నా ఏడవ సంవత్సరములో విడిపింపబడవచ్చని నిర్గమకాండము 21:2 మరియు ద్వితీయోపదేశకాండము 15:12 సూచిస్తున్నాయి. ఈ వాక్యభాగాలు మరియు లేవీయకాండము 25 మధ్య ఉన్న వ్యత్యాసాన్ని వివరించుటకు వివిధ వివరణలు ముందుకు వచ్చాయి. ఒక అవకాశామేమనగా విడిపింపబడే సమయము అనునది యజమాని దాసుని ఎలా సంపాదించెను అనుదానిపై ఆధారపడియుంటుంది. తననుతాను తోటి ఇశ్రాయేలీయునికి దాసునిగా అమ్ముకొనబడిన బీద మనుష్యుని గూర్చి లేవీయకాండము వివరిస్తుంది; ఇతర రెండు వాక్యభాగాలు హెబ్రీ దాసుని కొనుగోలు చేసినవానిని గూర్చి మాట్లాడుతుంది. ఒక ఇశ్రాయేలీయుడు తననుతాను మరియొక ఇశ్రాయేలీయునికి అమ్ముకొనిన తరువాత, ఆ ఇశ్రాయేలీయుడు వారి యొక్క పరవాసులలో మరియొకనికి వానిని అమ్ముకొనవచ్చును. దాసుని యజమాని బానిస చేత్తలో హెబ్రీ బానిసను అమ్మలేకపోయినా, ఇంకొక ఇశ్రాయేలీయునికి విక్రయించడానికి వ్యతిరేకంగా నియమం లేదు. అతడు అలా చేస్తే, తన స్వాతంత్ర్యం కొరకు సునాద సంవత్సరం కొరకు వేచియుండకుండా, ఆరవ సంవత్సరం చివరిలో ఆ దాసుడు వెళ్ళిపోవచ్చును. [12]"తన కుమారులు" అని ప్రస్తావించుట గమనార్హ కావచ్చు. ఒక ఇశ్రాయేలీయునికి మరియు తన భార్యకు వారి యొక్క దాసత్వం లేదా బానిస సమయములో పిల్లలు పుట్టినప్పుడు "నేను మిమ్ముగు కొనినప్పుడు మీరు ఈ కుమారులను ఉత్పత్తి చేసారు; కాబట్టి వారు నావారు. మీరు వెళ్లిపోవచ్చు, కానీ మీ కుమారులు నాతోనే ఉండిపోవలెను; వారు నా సొత్తు," అని చెప్పుట ద్వారా తన యజమాని వారిని తన స్వంత వారని పేర్కొనవచ్చును. ఈ ప్రకరణము అటువంటి అవకాశాన్ని వ్యతిరేకిస్తుంది; ఒక ఇశ్రాయేలు దాసుని కుమారులు ఆ దాసత్వములోనుండి తనతోపాటు విడిపింపబడవలెను. [13]ఒక బానిస కూడా తాను అభివృద్ధి చెందుటకు అనుమతించే వ్యాపారం చేయవచ్చని ఈ అవకాశం సూచిస్తున్నది. ఉదాహరణకు, ఒక బానిసగా అతడు చెప్పులు తయారు చేసుకొనేవానిగా ఉండవచ్చు. తన యజమాని కొరకు పనిచేయుటకు అదనముగా, ఇతరుల కొరకు అతడు చెప్పులు తయారు చేయవచ్చును. అతని యజమాని అతని వ్యాపార లాభాల శాతాన్ని అతడు ఉంచుకొనుటకు అనుమతించవచ్చును. ఫలితంగా, బానిస తన సొంత సంపదను కూడబెట్టుకోవచ్చును. [14]Lawrence H. Schiffman, "Sabbatical Year," in *Harper's Bible Dictionary*, ed. Paul J. Achtemeier (San Francisco: Harper & Row, 1985), 889. సబ్బాతు మరియు సునాద సంవత్సరములను సూచించు ఇతర రుజువుల కొరకు, యెషయా 61:1 చూడండి మరియు యెహెజ్కేలు 46:17 చూడండి. దాసత్వము మరియు వడ్డీలను గూర్చిన నియమముల కొరకు, నెహెమ్యా 5:1-13 చూడండి. [15]R. K. Harrison, *Leviticus*, The Tyndale Old Testament Commentaries (Downers Grove, Ill.: Inter-Varsity Press, 1980), 229. ఈ ప్రత్యేక సంవత్సరాలు ఇశ్రాయేలీయులచే ఆచరింపబడేవి అని విశ్వసించబడుటకు Harrison కారణాలను చర్చించాడు. (Ibid., 228-29.) [16]Gane, 440-41. [17]See Owen D. Olbricht and Bruce McLarty, *Colossians and Philemon*, Truth for Today Commentary (Searcy, Ark.: Resource Publications, 2005), 532-33.